# బాల



6

పిల్లల బొమ్మల పత్రిక




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము

# పసిపాపల పాలిటి శ్రీరామరక్ష



## మెక్లెక్
# గ్రైప్ కాల్




పసిపాపలకు సాధారణంగా కలిగే అజీర్తి, మందమూ మొదలగు వాటికి అమోఘమైనది. శిశువులకు హితకరమైనది.

పెరిగే పిల్లలకు పుష్టి నొసగే
మెక్లెక్ ఆహారము

- చిల్డ్రన్స్ ఫుడ్
- సిరప్ కాల్విటాల్




కెమిస్టు లందరియొద్దగాని,
మా యొద్దగాని దొరకును.

Meclec

**ది మెక్లెక్ న్యూట్రిమెంట్స్**
**అండ్ ఫార్మక్యూటికల్స్, లి.**

99-ఎ. ఆర్మీనియన్ వీధి, మద్రాసు 1.



మీ స్క్రాప్ పుస్తకమునకు భాగములుగా ప్రచురించబడిన కథ.



# మోటు, వానియొక్క నలుగురు స్నేహితులు





ఒకరోజు రాము, మురాద్, యూసుఫ్, నారాయణ, ఈ నలుగురు మైదానమున కూర్చొని యున్నప్పుడు మురాద్ ఇట్లనెను, "రండోయ్, ఆ చెట్టులోని మామిడికాయలను కోద్దాము."

ఆ చెట్టుకాయలకై నాకు, నాకని దొమ్ములాడుచుండిరి గాని, చెట్టుకు బూడిద **అంటినది** ఎవరూ చూడలేదు. బూడిద అంతా **వారికి అంటి** మురికియైనది. **అచట ఎవరో వచ్చుచుండిరి.** అది ఎవరు? మరొకసారి, తెలిసికొనగలరు.





దీ తాతా ఆయిల్ మిల్స్

కం॥ లిమిటెడ్.



సంపాదకుడు :
న్యాయపతి రాఘవరావు బి.ఎ.

సహాయ సంపాదకురాలు :
న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.ఎల్.టి.

# బాల

సంపుటి 2 ] ఫిబ్రవరి 1947 [సంచిక 7.

'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY.

## సినీమా బడి

ఆమధ్య ఒక మేస్టారు శని వారాలుకూడా బడి పెట్టేవాడట. శని ఆదివారాలు పిల్లలకు సెలవు రోజులు. సెలవురోజుల్లో బడికి వెళ్లడమే! ఆ బడిలోని పిల్లలందరూ కట్టుకట్టి శనివారం బడికి వెళ్లేవారు కారు.

ఆ మేస్టారు ఆఖరికి విసిగి ఆ శనివారం ఎలాగైనా పిల్లలకు పాఠం చెప్పాలని ఒక ఉపాయం ఆలోచించాడు.

"ఈ శనివారం పిల్లలందరినీ సినీమాకు తీసుకువెళ్తాను. సరిగ్గా 9-30 కి ఫలానా సినీమాహాలు దగ్గరకు అందరూ రావలసింది"- అని నోటీసు పంపాడు.

మేస్టారుగారి యీ అపూర్వ కరుణకు పిల్లలందరూ సంతోషించి, సరిగ్గా 9-30 గంటలకల్లా సినీమాహాలుదగ్గరహాజరయ్యారు. అక్కడ హాలులోనికి అందరూ ప్రవేశించాక, ఆ మేస్టారు స్టేజి మీద నిలుచుని తన పాఠం చెప్పడం మొదలెట్టాడు!

పిల్లలందరూ మేస్టారియుక్తికి ఘొల్లున నవ్వారు.

* * *

సినీమా చూడడంలో వున్న సరదా, పిల్లలకు పాఠాలమీద అంతగావుండదు. సినీమా సరదా పాఠాలమీదకూడా వుండాలంటే, మనబడులు సినీమాలవాలి. అంటే పిల్లలకు విజ్ఞానాన్ని ఇచ్చే ఫిలుంలు గవర్నమెంటువారు తీయించి ప్రతి బడిలోనూ ఆ ఫిలుంలు చూపించాలి. ఫిలుంల ద్వారా పాఠాలు నేర్పాలి. ఏమంటారు?

# చదువూ - సంధ్యా

అ - ఆ - ఇ - ఈ చదివేదము
అబద్ధమాడక ఉండెదము
క - ఖ - గ - ఘ వ్రాసెదము
కలిమి లేదన మెన్నడునూ
త - థ - ద - ధ నేర్చెదము
తల్లికి దండము పెట్టెదము
య - ర - ల - వ వ్రాసెదము
యదుకుల కృష్ణుని తలచెదము.

రచన : మలపాక రామ సూర్యనారాయణమూర్తి, (వేల్పూరు.)



వదిన : అదేమిటే ఆ కొంకిరిగీతలు ?
మరదలు: అది నీ పేరు ఒదినా? అద్దంలోచూడు అక్షరాలు తెలుస్తాయి.

# రేషన్ బావ

★


రచన:

వరలక్ష్మి

తేలప్రోలు.




పొట్టిబావ

[పొట్టిబావ పండక్కి వచ్చాడు, చిట్టిమరదలిచ్చిన బహుమానాలు చాలక అలిగాడు. తనకిచ్చిన మిల్లు బట్టలు చాలక కోపంవచ్చి సంక్రాంతి మధ్యాహ్నమే మదరాసుకి ప్రయాణం అయాడు - అప్పుడు చిట్టిమరదలు ఇలా పాడింది.

పొట్టి బావ పొట్టి బావ
ఎక్కడి కెళ్తావు?

మంత్రిగార్ని చూడ్డానికి
మద్రాస్ వెళ్తాను!

పొట్టి బావ పొట్టి బావ
ఏమి చేస్తావు?

ఐదు గజాల్ చాలకపోతే
రాట్నం కొంటాను!

## సౌందర్యానికి, ప్రయోజనానికి, మన్నికకు,

## మద్రాసు సహకారోద్యమ

# నేతబట్టలు

ఎప్పటికప్పుడు కొత్తసరకుతో నిండియుండే ఈ సొసైటీవారి షాపులలో విక్రయించే నేతబట్టలు, రకరకాల నవీన డిజైన్లు కలిగినవేకాక, మిల్లుబట్టలకంటె ఎక్కువ నాణ్యము, మన్నికగలిగినవి. కమిషన్ ఏజంట్ల ద్వారాకాక, ఫ్యాక్టరీలనుండి నేరుగా లభించుటవలన అవి అతిచౌకగా గిట్టగలవు. మద్రాసు పట్టణంలోనూ, ఇతరప్రదేశాలలోనూ గల ఈ సొసైటీవారి దుకాణములలో అనుభవజ్ఞులైన అమ్మకపుదారులు. మీ సంతుష్టికి, మీ పొదుపుకు సహాయపడేటట్టు తర్ఫీదు పొందియున్నారు.

మగ్గాలమీదనించి సరాసరి మీకు:

ధోవతులు; చీరెలు; షర్టింగులు; తువ్వాళ్లు; అద్దకాలు; జంపకాణాలు; చీటీగుడ్డలు; తెరలు; మేజాబల్లమీదికి గుడ్డలు; దుప్పట్లు; రుమాళ్లు; లుంగీలు; దోమతెరలు; మెత్తలు; దిండ్లు అన్నియు దొరకును.

మద్రాసు సహకార నేతబట్టలు
కంట్రోలు ధరలకు తాజాసరకు


## మద్రాసు హ్యాండ్ లూమ్ వీవర్స్
## ప్రొవిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లి.

నెం. 6-ఎ. ఉడ్సురోడ్డు-మౌంటురోడ్డు, మదరాసు.


 M. H. W. I.

# పక్షులోయ్! పక్షులు!

బాలా! పక్షులెన్నిరకాలో తెలుసా? ఇదుగో యీ గళ్ళ పంజరములో చూడు - చూచిన పక్షినేచూచి మాట్లాడించావంటే బుగ్గలు కొరుకుతుంది సుమా! చిలిపిచేష్టలుచేయక, జాగ్రత్తగా త్రోవ కనుక్కో.




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఊ | ము | ల | జ్బ | వాం | ము | ప | ల |
| ర | పి | బ | గ | స | ర | క్షి | నీ |
| క | చ్చి | గూ | గ | కొం | వ్వ | పొ | ట్ట |
| చ | కో | డ్ల | ఉ | కు | ము | కి | పి |
| ప | ర | గు | ష్ట్ర | ల | ధు | బం | రా |
| క్షి | గ | క్షి | ప | గ | డే | కా | కి |
| క్షి | రు | కి | ల | క | గో | వి | మి |
| పి | డ | కో | చి | లు | రిం | క | నె |

రచన: D. L. అశ్వత్థ, (బళ్లారి).

# కోడి -

(పాట - కథ)



కొక్కొ_రో కోయని
కోడి కూసినది
కోరి వెళ్లినది
కోడి తపస్సుకు-

ఘోరాటవిలో
ఘోర తపస్సును
కోరి చేసినది
కోరిక గలదై.

దేవుడు వచ్చెను
దీవన లివ్వగ
కోడిని వరముల
కోరు కొమ్మనెను.

కోడి : కనికరించితివ
కరుణించితివా
దేవా దేవా
దేవాది దేవ
దీన బాంధవా
దివ్య ప్రభావ
నూరు కన్నులను
కోరితి నిమ్మా.

దేవుడు : కోడీ కోడీ
కోరక కోరక
కోరితి వేమే
కొలది కోరికను ?

కోడి : దేవా కన్నులె
గావా యింద్రుని
గొప్ప తనమునకు
గొప్ప కారణము!
పక్షి జాతిలో
పక్షీంద్రుడనై
ప్రకాశింప గల
భాగ్యము నిమ్మా.

దేవుడు : అయ్యో బిడ్డా !
అభాగ్య రాలా !
నూరు యజ్ఞముల
నాచరించుటను
అత డింద్రుండై
అలరుచు నుండెను
కన్నుల చేతను
కానే కాదు.



# నెమిలి

రచన : నాగవోలు వెంకట అప్పారావు (పాలకొండ)

కోడి : కోరు కొంటినిను
కన్నుల నిమ్మా
మాదు పక్షులే
మోదము తోనను
రాజు కాదు
రాజేంద్రుని చేయును.

దేవుడు : కోడీ నీదగు
వేడుక తీర్పగ
ఆహా యిచ్చితి
ఆహా యిచ్చితి—

* * *

దేవుడు మాయై
పోవగ కోడియు
కలకల లాడే
కన్నుల తోడను
నిగ నిగ లాడే
నెమిలి కోడియై
పక్షీంద్రుడ నని
పక్షుల తోననె.
వర ప్రభావము
నరయుచు పక్షులు
నెమిలి చెప్పునది
నమ్మ చుండగా
చతురత తోడను
చిలుక లిట్లనియె:—
"కాని యెందుకా
కానని కన్నులు
కోడి పుంజనీ
ఏడుపు తీర్పగ
పురియును కన్నులు
పెట్టెను దేవుడు.
రాజునంచు రా
రాజు నంచనగ
సిగ్గు లేదనీ
సిగ్గు బొగ్గులవ!"
చిలుక లిట్లనగ
పులుగు లన్నియును
నెమిలిని తరిమెను
నట్టడవికిని.
నాటి నుండియును
నేటికి కూడను
కొద్ది కోరికను
కోరిన నెమిలికి
అరణ్య వాసమె
శరణ్య మయ్యెను.



# గారడీ!

ప్రకాష్ పిల్లలందరిలోకి మందమతి. అతనికి జ్ఞాపకశక్తి తక్కువ. ఇదిగాక అతను చిరుతిండిపోతు. సరిగా భోంచేయక, అస్తమానం కన్న గడ్డితో కడుపు నింపుకోవడం వల్ల అతని ఆరోగ్యం చెడింది. అన్నం రుచించేదికాదు. ఈ కారణాలవల్ల బాలురందరిచేత పరిహసింప బడేవాడు.

ఇలావుండగా అతనింటికొక గొప్పవైద్యుడు వచ్చాడు. ప్రకాష్‌ను పరీక్షించి, అతని బాధలు గ్రహించి యీ విధంగా ఒకచీటి వ్రాసిచ్చాడు.

> రోజూ అన్నంలో కలుపుతు తినే సాధకాలను తిలక్ మార్కు ఇంగువను కొద్దిగాచేర్చి తయారుచేసి భోజనం పెట్టిన, ప్రకాష్ బాధలు కనుకట్టు వింతలా మటుమాయమవుతాయి. అన్నంమీద అరుచితొలిగి, కడుపునిండా భుజింపగలడు. మంచి తెలివితేటలతో ప్రకాశింపగలడు.
>
> ✼ తిలక్ మార్కు ఇంగువ అంతటా దొరుకును. లేదా గోపాల్జీ చాంప్షి అండ్ కో., 30 గోవిందప్ప నాయకన్ వీధి, జి. టి. మద్రాసు, వద్ద దొరకును........

ఈ చికిత్సచే ప్రకాష్ ఆరోగ్యవంతుడై, జ్ఞాపకశక్తి వృద్ధికాగా, అఖండమైన తెలివితేటలు గలవాడై, కీర్తి గౌరవాలను సంపాదించాడు. ఇప్పుడుకూడా తిలక్ మార్కు ఇంగువనే వాడుచున్నాడు.

పిల్లలూ! మీరుకూడా యెందుకు తిలక్ మార్కు ఇంగువవాడి ప్రకాష్‌లా ప్రతిభావంతులు కారాదు?

# "బాల" పాత కాపీలు

"బాల" పాతకాపీలు "కావాలి, కావాలి" అని అనేక మంది కోరుతున్నారు. కాని, మావద్ద అన్ని సంచికలూ లేవు. ఈ దిగువ వివరించిన సంచికలు కొద్ది ప్రతులుమాత్రమే వున్నవి. కావలసినవారు వెంటనే వ్రాయండి. వీ. పీ. పద్ధతిలేదు.

| | | | |
|---|---|---|---|
| 1945 | అక్టోబరు | మాస్టర్ పండూ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | శ్యామల "బాల" | 0- 6-0 |
| 1946 | జనవరి | సంక్రాంతి సంచిక | 0-12-0 |
| ,, | ఫిబ్రవరి | గాంధీ "బాల" | 0- 6-0 |
| ,, | మే | వంతులాట "బాల" | 0- 6-0 |
| ,, | జూన్ | పిల్లి - ఎలుకా "బాల" | 0- 6-0 |
| ,, | జులై | తాత గుర్రం "బాల" | 0- 6-0 |
| ,, | ఆగస్టు | పుట్టింరోజు సంచిక | 1- 0-0 |
| ,, | సెప్టెంబరు | బెలూను "బాల" | 0- 6-0 |
| ,, | అక్టోబరు | కోడి బండీ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | గిరిజ "బాల" | 0- 6-0 |
| | | | 5- 2-0 |
| | | పోస్టేజి (రిజిస్టర్డు) | 0- 6-0 |
| | | మొత్తము | 5- 8-0 |

వెంటనే మనియార్డరు ఈ దిగువ ఎడ్రసుకు పంపండి.

మేనేజరు : "బాల", మైలాపూరు, మదరాసు 4.



# బాలసేన సొంతపాట



రచయిత: సూరిశెట్టన్నాయ్

అమ్మంటూందీ
కలెక్టరవమని,
నాన్నంటాడూ
వైస్రాయవమని,
అత్తంటూందీ
గవర్నరవమని,
మామంటాడూ
మేస్త్రేటవమని,
అన్నంటాడూ
ఎడిటర్ మేలని,
అక్కంటూందీ
ఆఫీసరవమని,
మామ్మంటూందీ
మేనేజరవమని!

అ-బ్బె-బ్బె-బ్బే!
యేమీకాదు,
బానిస ఉద్యో
గాలు యివన్నీ,
ఛా! ఛా! యేదీ
ఆక్కర్లేమా,
భారతమాతకి
స్వతంత్ర మొసగే,
బానిసతల్లికి
బాధలుబాపే,
స్వతంత్ర సిపాయి
నై పోతాను,
బాలసేనలో
పనిచేస్తాను—

జయ్‌హింద్.







# పోతాను — చూస్తాను


పోతాను ప్రపంచం కొనదాకా
చూస్తాను చోద్యా లెన్నెన్నో !
చిన్ని వూరు ఇది దాటినచో
ఎన్నెన్నో వూర్లున్నాయి
ఎన్నో వింతలు వున్నాయి
అన్నియు ఎన్నడో చూచెదను
పోతాను ప్రపంచం కొనదాకా
చూస్తాను చోద్యా లెన్నెన్నో !

'అన్న'

## దారికి అడ్డు

తండ్రి : నా కొడుకు సంగతి చూస్తే నాకేమీ తోచటంలేదు. ఆఖరికి వాడు మోటారు డ్రైవరు అవుతాడట !

స్నేహితుడు : నీ కొడుకు గురించి నీవు ఏమి ఆలోచించినా సరేగాని, వాడిదారికి మాత్రం అడ్డురాకు !




కానన్ ష్మిడ్ కు
వేలూరి శివరామశాస్త్రి
అనుసరణం.

# అరటి పండ్లు

సావిత్రికి ఇద్దరు ఆడపిల్లలూ ఇద్దరు మగపిల్లలూ. ఆమె ఒకనాటి సాయంకాలం తన పిల్లలను వెంట బెట్టుకొని తాత గారిని చూడబోయింది.

ఆ తాతగారు ఒక చక్కని తోటలో ఉంటాడు. ఆ తోటలో చాలా పండ్ల చెట్లు ఉన్నవి. పూల చెట్లుకూడా ఉన్నవి.

ఆ తాతగారు ఒక అరటి ఆకులో నాలుగు అరటి పండ్లు పెట్టుకుని సావిత్రి పెద్ద కూతిరి కిచ్చి "ఈనాడు నాలుగు పండ్లే పండిఉన్నవి, మీకు ఇంకా కొన్ని పండ్లు ఈయజాలనందుకు చాలా విచారంగా ఉన్నది. సరే కాని మీ రైదుగురూ ఈ నాలుగు పండ్లనూ తుంచకుండా పంచుకోవాలి, ఎల్లా పంచుతావో పంచు, చూతాం'' అని అన్నాడు.

సావిత్రి పెద్ద కూతురు పేరు అన్నపూర్ణ. ఆ పిల్ల కొంచె మాలోచించి ఇట్లా పంచింది. అంటే: "మేము అప్పాచెల్లెండ్లం ఇద్దరమూ, ఒక పండూ-వెరసి మూడు; ఈ అన్నదమ్ములిద్దరూ, ఒక పండూ - వెరసి మూడు. మిగిలిన ఈ రెండు పండ్లూ, అమ్మా-వెరసి మూడు. ఏం సరిపోయిందా?" అని అన్నది.

ఈ పంపకానికి చెల్లెలూ తమ్ములూ చాలా సంతోషించారు. వాళ్లకంటే వాళ్ల తల్లి మరీ సంతోషించి: "అమ్మా నాకీ

పండ్లు అక్కఱ లేదు లే, ఈ నాలుగింటినీ మీరు తలా ఒకటీ పుచ్చుకోండి'' అని అన్నది.

తాత ఒక పూలచెండు తెచ్చి అన్నపూర్ణకిచ్చి-''అమ్మాయీ! నీ పంపకానికి నేను చాలా సంతోషించాను. నీకు మీ అమ్మమీద ఉన్న భక్తికి అంతకంటె మరీ సంతోషించాను'' అని అన్నాడు.

చతురత తెల్వియుఁ జక్కనివేని
అతిశయించు నుదారమగు బుద్ధివీని

---

# పోక కాయ

ఇద్దరు బాలురు తోటలోకి షికారు వెళ్ళారు. అక్కడ ఒక పోకచెట్టు ఉంది. వారు ఇద్దరూ ఆ పోకచెట్టు నీడలోనికి వెళ్ళారు. అక్కడ ఒక పోకకాయ పడి ఉంది. సోమయ్యా దానిని ముందు చూచి ''అదుగో''అని అన్నాడు. భీమయ్యా వంగి దానిని తీశాడు.

''ముందు నేను దానిని చూచాను కాబట్టి అది నాది''అని సోమయ్యా అన్నాడు. ''ముందు నేను తీశాను, కాబట్టి ఇదినాది'' అని భీమయ్యా అన్నాడు. ఈ లాగు వాళ్లిద్దరూ నాదంటే నాది అని తగవు లాడుకుంటూ వున్నారు.

సరిగా ఆ సమయానికి రామయ్యా అనే బాలు డొకడు అక్కడికివచ్చాడు. అతడు వాళ్ల పోట్లాటవిని ''నేను మీ తగవు తీరుస్తాను'' అని అన్నాడు.

రామయ్యా ఇలా అనంగానే భీమయ్యా తన చేతిలోఉన్న పోక కాయ రామయ్యాకు ఇచ్చాడు. రామయ్యా ఆ పోకకాయ రెండుగా పగులగొట్టాడు. పిదప ఒకడిప్ప చేతబుచ్చుకుని- 'ఇదిగో! మొదట చూచాడు కాబట్టి ఈ డిప్ప సోమయ్యాకు. మొదట తీశాడు కాబట్టి ఈడిప్ప భీమయ్యాకు. మీ తగవు తీర్చాను కాబట్టి అసలువక్క నాకు' అని రామయ్యా నోట వేసుకుని 'కోర్టులలో చాలా దావాలీ లాగు వనే' అని నవ్వుతూ నమలడం మొదలుపెట్టాడు.

పొరుగువారల తీరుపులు కోరితేని
నడుము కట్టుము సర్వనాశానికేని

# మామిడి చెట్టు

రామస్వామి తన యింటి ముందు పెద్ద మామిడి చెట్టు నీడలో కూచున్నాడు. అతని మనుమలు కింద రాలిన కాయలు తీసి "తీయగా లేవు" అని అంటూనే వున్నారుకాని తినడం మటుక్కు మానలేదు.

వారిని చూచి వాళ్ల తాత- "అసలీ చెట్టు ఇక్కడికెల్లా వచ్చిందో మీకు చెప్పవలసి ఉన్నది. నలభై యేండ్లకుముందు ఇదంతా పెద్ద మైదానం. ఇదిగో ఇపుడీచెట్టు ఎక్కడుందో సరిగ్గా అక్కడ నేను నిలబడి మన పొరిగింటి పున్నయ్యగారితో 'ఇంకొక్క వంద రూపాయల రాబడి గనుక ఉంటే నా సంసారానికి సరిపోతుంద'ని నా గోడు వెళ్లబోసుకున్నాను."

మన పున్నయ్యగారు చాలా తెలివి గలవాడు. ఆయన నా మాటలు విని "చేయవలసినపని తెలిపికొని ఆ పని తిన్నగా చేస్తే నీ వనుకొన్న మొత్తం సులభంగా వస్తుంది. అదిగోచూడు, నీవు నిలబడి ఉన్న చోట చాలా డబ్బు ఉంది. నీవుమాత్రం శ్రమ పడాలి. శ్రమకు తగిన లాభం ఉంది" అని అన్నాడు.

నేనప్పటికి మాంచివయసులో ఉన్నాను. చీకటి పడ్డది. పార, పల్లిక తీసుకునివచ్చి గుంట తవ్వటం మొదలుపెట్టాను. తవ్వాను తవ్వాను; వొళ్లంతా చెమటలు పోసింది. ఒక చిల్లి గవ్వకూడా కనబడలేదు.

తెల్లవారింది. పున్నయ్య మామ నేను తవ్విన గొయ్యి చూచి, పక్కలు విరిగేట్లు నవ్వి- "ఓరి తెలివి తక్కువవాడా! నా ఉద్దేశం నీకు తెలియలేదు. నేనిప్పుడు నీకొక మామిడిమొక్క ఇస్తాను. దానిని ఈ గుంటలో పాతు. కొన్నాళ్లకు నీ వనుకొన్నంత డబ్బు రాకపోతే నన్నడుగు." అని అన్నాడు. సరేనని అన్నాను. అతడు మొక్క యిచ్చాడు. నేను తీసుకొచ్చి ఆ

గుంటలో పాతాను. ఆ నాడు పాతిన ఆ చిన్న మొక్కే ఇప్పుడు మీరు చూస్తూ వున్న యీ మహా వృక్షం. ఇన్నాళ్లనుండి ఇది కాస్తూ వచ్చిన కాయలవల్ల బోలెడు డబ్బు వచ్చింది. ఇది మూల ధన మనుకోండి. దీని మీద ఇంకా పది కాలాలపాటు వడ్డీ వస్తూ వుంటుంది. కాబట్టి పున్నయ్య మామ చెప్పిన యీ క్రింది నీతిని నేను మరవలేను.

తెలివితోడుత నెడతెగక కష్టింపఁ
గలవేని కలదురా కలుముల దుంప

— —

# జొంపము లేక ఆకుల గుబురు

కామయ్యకు తోచదు. ఎవడు చెప్పినా వినడు. కర్మం చాలక ఎవడయినా చెబితే వాణ్ణి వెక్కిరిస్తాడు.

వా డొకనాడు చెల్లెలు సుశీల పెంచుతున్న పూలతోటలోకి వెళ్లాడు. సుశీల పాతిన మొక్కలన్నీ చక్కగా పూస్తున్నవి. కామయ్య తనుపాతిన మొక్కలలో కలుపు తీయ లేదు. అతని పూలతోట అంతా ఔరు గడ్డితో వెనవేసికొని పోయింది. ముండ్ల చెట్లు మొలిచి కాలు పెట్టడానికి వీలు లేకుండా ఉంది.

'అన్నయ్యా నీ వే పనినీ సరిగా చేయవు. అమ్మ అన్న మాట ముమ్మాటికీ నిక్కము. నీవీ జన్మములో ఒక జొంపము దాకా రాలేవు' అని అన్నది.

కామయ్య నవ్వి దాపునఉన్న ఒక బేరి చెట్టు ఎక్కి- 'సుశీలా, చూడు, నే నిప్పు డెంత చెట్టు దాకా వచ్చానో' అని పలుకుతూ వుండగా పటపటమని ఆ కొమ్మ కాస్తా విరిగింది. కింద పడ్డ కామయ్య చేయికూడా విరిగింది.

చెలికాని బోధమ్ము చెవి బెట్టకున్న
మంచిమార్గము నీకు మలయుటసున్న

# చందమామ!



రచన : మానేపల్లి సంగమేశ్వరరావు,
(మచిలీపట్నం.)

మంచు కొండల వెనుక పొంచున్న జాబిల్లి
అంచనెక్కి రార ఆడుకుందాము.
నీదేశమేదోయి నిలచిమాటాడోయి
పాదాలు లేని నీ పయనమే హాయి.
పసిపాప నవ్వులో పాలపై నురుగులో
మిసిమి మీగడ నావ మీదెక్కి రార.
చూపు కందని దవ్వు సురల కందెడి పువ్వు
తీపి వెన్నెల మధువు తేవోయి జాబిల్లి.
పాల వెన్నెల నీడ పరుగులెత్తే జాడ
రాలిపోవని మాల రచియించె మా బాల.

# పాపా చెప్పుకో!

ఎంతో అందంగా
ఉంటుంది
అందని పండు
ఆకాశంలో
చల్లని కిరణం
మెల్లని చూపూ
పండు వెన్నెలా
పాలవెల్లులు
పూర్ణిమ నాటికి
పూటవుతుంది
అమవస నాటికి
అసలే లేదు
ముచ్చటగొలిపే
మోహన భస్మం
మీదఁ జల్లితే
మొద్దు నిద్దతే
ఆ పండేమిటి
పాపా చెప్పుకో
'చందమామ' అని
చెప్పేస్తా!

రచన: చెరుకుమిల్లి భాస్కరరావు,
రాజమండ్రి.


# పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్నాకులం.

# బస్సు గర్వభంగం

రచన: కొడవంటి బ్రహ్మాజీరావు, బి. ఏ., బి. ఇడి. (బొంబాయి)

(ఆంగ్లం నుండి)

అనగా, అనగా ఒక కొండ మీదో వూరుంది. ఆ వూరి గేటుదగ్గరో భూతం వుంది. ఆ భూతానికి బస్సులంటే చాలా ఇష్టం. ఇష్టం అంటే ఎక్కడానికి కాదు, తినడానికి! కొండచివర రోడ్డుకి అడ్డంగా తన నోరు పెద్దగా తెరచి పెట్టుకొని కూర్చుంటుంది. పాపం, బస్సులు ఆదారిని ఏమీ తెలియకుండా వచ్చి ఆ నోట్లో పడిపోతాయి! ఘటోత్కచుడు లడ్డూలు మింగివేసినట్టు, ఆ పెనుభూతం బస్సులను మింగివేసేది!

ఇలాగ్గా ఆ వూరికొచ్చే బస్సులన్నీ ఐపోయినాయి, ఒకటితప్ప. ఆ ఒకబస్సూ దేవుణ్ణి అడిగింది. ఏమనీ?—కోరుకున్న రూపం దాల్చే శక్తి ఇమ్మని. సరేనన్నాడు దేవుడు.

కొండమీద వూరికి బయలుదేరిందా బస్సు. భూతం దగ్గరకి వచ్చేటప్పటికి రోలరింజనుగా మారిపోయింది. భూతం వదలిపెట్టింది. ఊళ్ళోకివెళ్ళి మళ్ళీ బస్సుగా మారిపోయింది.


ఇది చూచి భూతానికి కోపం వచ్చింది. ఆ దారిని ఇంకో రోలరింజనువస్తే బస్సేఅనుకొని మింగింది. ఆరోలరు గొంతుక్కి అడ్డుపడింది, ఉక్కిరిబిక్కిరై పోయింది.

ఇలా బస్సు ప్రతిరోజూ, రోజుకొక మారురూపంతో వెళ్ళేది. బస్సు దొరకకపోవడం వల్ల భూతానికి ఆకలి, కోపం ఎక్కువై పోయాయి. బస్సుకి గర్వం ఎక్కువైంది. నా తెలివితేటలు చూడు అని తన స్నేహితుడు హైరోడ్డుతో డాబులు కొట్టింది. ఒకనాడు ఇద్దరు లావుపాటి మనుష్యులు బస్సెక్కడానికి చూస్తున్నారు. బస్సుకి అంత


బరువు మోయడానికి ఇష్టంలేదు. అంచేత, స్టాండుదగ్గరకు వచ్చేసరికి, లారీగా మారిపోయి ఆగకుండా వెళ్ళిపోయింది.

మరోనాడు ఇద్దరు ముసలమ్మలు స్టాండులో గంటసేపు కూర్చున్నారు బస్సు వస్తుందని. బస్సువచ్చింది కాని వెంకితనానికి కాస్తసేపు గడ్డిలారీలా కనిపించింది. స్టాండు దాటేక బస్సుని చూచి గుడ్డివాళ్ళమని తిట్టుకున్నారు. ముసలమ్మలు దుఃఖపడుతూ నడుచుకొని పోయారు.

ఇది చూచి రోడ్డుకి పట్టరాని కోపం వచ్చింది. బుద్ధిలేని బస్సుని శిక్షించాలను కొంది. మాటాడకుండా కొండమీదకి దారితీసింది. మనుష్యుల్ని కూడా మాయచేస్తున్నానుకదా అని గర్వంతో నవ్వుకుంటూ విరగబడుతూ పోతూన్న బస్సుకి ఇదేమీా కనుపించలేదు. తిన్నగా వెళ్లి ఆ భూతం నోట్లోపడింది. తనకోపం, ఆకలి తీరేట్లా ఆ భూతం బస్సుని నమలకుండానే మింగేసింది!



బాల చందాదారులు, ఉత్తరాల్లో తమ చందా నెంబరు రాయడం మరచిపోకండి.



# నిజంగా జరిగిందే!

రచన: ద్విభాష్యం లక్ష్మీదేవి (అనకాపల్లి)

మా మామయ్య వస్తాడని కాకికేం తెలుసు? అసలు మా చిట్టి చెల్లాయికి కాకి అంటే ఎంతో సరదా. అప్పుడప్పుడు దాన్ని తరుముతూ పడి పోతూంటుంది.

మొన్న నేనూ, మా అక్క, మా చెల్లాయి ముగ్గురం పొద్దున్నే దొడ్లో చీడీమీదకూచుని మొగం కడుక్కుంటున్నాము. అప్పుడు ఓ కాకి మా దండెంమీద కూచుని అరుస్తోంది. మా చెల్లాయి ఆ కాకిని చూసి; "కాకి - కాకి-పో తుత్తాలొత్తె-పో" అంది. అప్పుడు నేను అల్లాకాదు అనడం——

కాకికాకి - చుట్టాలొస్తే చూచిపో.
పక్కాలొస్తే - పారిపో.
మా మామయ్యొస్తే ఖరేలుగంతై"

అనాలి అన్నాను. వెంటనే ఆ కాకి దండెంమీదనుంచి ఎగిరి ఎక్కడికో పోయింది.

కాకి పోయిందని మా చెల్లాయి ఏడుస్తోంది. ఇంతట్లో మా సుబ్బారావు మామయ్య అరటి పళ్లూ, అరిటాకులు, కూరలు ఏవేవో పట్టించుకుని నిజంగానే వచ్చేసేడు. అందరం సంతోషంతో "మామయ్య వచ్చేడే అమ్మా" అని అరిచేము. మా కేకలు విని మా అమ్మ వంటింట్లోంచి యివతలకు వచ్చింది.

"కాకి మంచిది. అరటిపళ్ళు దొరికేయి పొద్దున్నే" అన్నాను నవ్వుతూ. కాకి అడ్డంగా వెడితే శకునానికి మరీ మంచిదన్నాడు నవ్వుతూ మా మామయ్య.

ఆ రోజు సంతోషంగా పాతవి కొత్తవి బాల పుస్తకాలు పట్టికెళ్ళి మా మామయ్యకు చూపించేము. అవి చూచి ఆనందించి యీ నెల క్రొత్త బాలపుస్తకము ఒకటికొని మా బావకు తీసుకువెళ్ళేడు వాళ్ళింటికి. ఇదీ జరిగిన కథ. ఇది అబద్ధమేమో అడగండి కావలిస్తే మా మామయ్యని.

# చిన్ని పాపాయి




రచన: మ, పద్మావతి (గుంటూరు)

మా చిన్ని పాపాయి
మంచి పాపాయి
అల్లరులు చేయక
ఆడు కొంటుంది
మొండి పట్టూపట్టి
మూల కూర్చోదు
బొజ్జనిండా బువ్వ
ఆరగిస్తుంది ॥మా॥
ప్రొద్దున్న బడిలోకి
పోకమానాదు
చక్కగ పాఠములు
చదువ నేర్చింది

ఆటలు పాటలు
ఆడ నేర్చింది
ఇంటినిండా ముగ్గు
పెట్ట నేర్చింది ॥మా॥
చేయిత్రిప్పుచు నాట్య
మాడ నేర్చింది
బొమ్మలను సొంపుగా
గీయ నేర్చింది
దేవునికి జేజేలు
పెట్ట నేర్చింది
మా చిన్ని పాపాయి
మంచి పాపాయి

బాలి

సం॥ చందా రూ 5/-
(ప్రత్యేక సంచికతో సహా)
వీ. పి. పద్ధతి లేదు.




# ఎందుకు పూజచేయరు?

రచన: ఆకెళ్ల రాధాకృష్ణ

బాలా - నువ్వు ఎప్పుడైనా మొగలిపువ్వుకథ విన్నావా? నేను చెపుతా వినుమరి.

ఒకరోజున బ్రహ్మ, విష్ణువు, శివుడు, వీళ్ల ముగ్గురిలోను ఎవరు గొప్పవారని ప్రశ్న వచ్చింది. అప్పుడు అకస్మాత్తుగా శివుడు కాస్తా మాయమయి పొయ్యాడు. బ్రహ్మ, విష్ణువులకి, ఒకపెద్ద శరీరం మాత్రం, వాళ్లముందర కనపడింది. వాళ్లిద్దరికి ఈశరీరం యొక్క, మొదలు, చివర తెలుసుకుందామని ఆలోచనపుట్టి, బ్రహ్మ, చివరని చూడటానికి, విష్ణువు, మొదలు చూడటానికి వెళ్లేరు.

బ్రహ్మ, పైకి పోతూండగా, దారిలో ఒక మొగలిపువ్వు కనపడింది. నువ్వెక్కడికి పోతున్నావని మొగలిపువ్వుని బ్రహ్మ అడిగేడు, "నేను యీ శరీరం చివరని చూడటానికి ఎన్నాళ్లనుంచో వెళ్తున్నా. కాని ఇంకా చేరలేకపొయ్యాను" అని మొగలిపువ్వు సమాధానం చెప్పింది. అప్పుడు బ్రహ్మ అన్నాడు: "నేనుకూడా దీని అంతం చూడటానికి ఎంత కాలంనుంచో వస్తున్నాను. కానిచూడలేకపొయ్యాను. నేను చివరని చూచానని నీవు విష్ణువుతో చెపుతావూ?" అని.


మొగలిపువ్వు "సరే-అల్లాగే చెపుతా" నంది.

విష్ణుమూర్తి, మొదలు చూడలేక తిరిగి వచ్చేసేడు. వానితో బ్రహ్మ ఆ శరీరంయొక్క అంతం చూచానని చెప్పేడు. బ్రహ్మకి,

మొగలిపువ్వు అవునంటూ సాక్ష్యం పలికింది, విష్ణువు, పాపం, నమ్మి, బ్రహ్మకు నమస్కరించాడు.

అప్పుడు శివుడు ప్రత్యక్షమై; బ్రహ్మ, మొగలిపువ్వు, వీళ్లిద్దరు, అబద్ధ మాడారని చెప్పి, మొగలి పువ్వుని, పూజకి పనికిరాకుండా శపించాడు. మొగలిపువ్వు శివుణ్ణి ప్రార్థించింది. శివుడన్నాడూ, పూజకు పనికిరాకపోయినా, అందంగా వుండేటట్లు, తలలో పెట్టుకునేటట్టు దయదలిచాను" అని.

చూశావా - బాలా, మరి, మొగలిపువ్వుతో పూజచెయ్యరు-ఎందుకనుకున్నావు ? ఇందుకే.





# జాబ్ కో
# వస్తువులు
## అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్ కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా ? జాబ్ కో మార్కుగల వస్తువులే, అన్నిటి కంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు.

జాబ్ కోనే కొనుడు.


●

మేము తయారుచేయు వస్తువులు :

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హేర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

●

## జయభాతరం కంపెనీ
మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.




# హైదరాబాదు

విరారు విన్నారో లేదోగాని మనదేశపు దక్షిణభాగంలో 'గోల్కొండ' అనే గొప్పపట్టణముండేది. ఆ పట్టణాన్ని ఏలేరాజు మహమ్మదీయుడు. ఆ రాజునే 'నవాబు' అని పిల్చేవారు. ఆ వూళ్ళోవుండే కొండమీద మంచి మేడలు కట్టుకొని కాపురముండేవాడు నవాబు.

ఈ నవాబుదగ్గర మంచి అందగత్తె ఒకతె వుండేది. పేరు 'భాగ్యమతి'. చక్కని పేరుగదూ! భాగ్యమతిమీద నవాబు కెంతో ప్రేమ. ఆమె ఏది కోరితే అదిచ్చేవాడు.

గోల్కొండదగ్గర పారుతూండే 'మూసీ'నది ఒడ్డున గొప్ప నగరాన్ని కట్టించాడీ నవాబు. చాలా రోజులు ఆలోచించాడు. ఏమని? ఆ కొత్త నగరానికి ఏపేరు పెడితే బాగుంటుందా అని. ఆలోచించి ఆలోచించి, చివరకేం చేశాడనుకున్నావ్! అందరికంటె ఎక్కువగా ప్రేమిస్తాడే ఆ అందగత్తె పేరే పెట్టాడు—'భాగ్యనగరము' అని.

నవాబుగారుండే గోల్కొండలో సరిగా మంచినీళ్ళు దొరికేవి కావు. అందుచేత ఆ వూరును వదలి భాగ్యనగరానికొచ్చాడు. కొన్నాళ్ళకు భాగ్యమతి చనిపోయింది. తర్వాత ఆ నవాబే భాగ్యనగరానికి 'హైదరాబాదు' అనే పేరుపెట్టాడు.

ఇప్పుడుకూడా హైదరాబాదులో నవాబున్నాడు. ఆయన్ని నవాబు అని పిలవరు. 'నైజాం' అంటారు. ఆయన రాజ్యాన్నే 'హైదరాబాదు సంస్థానం' అంటారు. మన దేశం

లోని సంస్థానాలన్నిటిలోకి హైదరాబాదు సంస్థానమే పెద్దది. దీనికి ముఖ్యపట్టణం కూడా హైదరాబాదే!

నైజాంగారి కీవుాళ్ళో చాలా పెద్ద భవనముంది. దానిపేరు 'ఫలక్‌నామా రాజభవనం'. బలే అందంగా వుంటుంది. ఈ వూరి మధ్యలో చాలా ఎత్తైన స్తంభాలు నాలుగున్నాయి. వాటికే 'చార్ మీనార్' అని పేరు. ఇవికట్టి ఎన్నో సంవత్సరాలైనాయి. హైదరాబాదులో ఎక్కడికి కెళ్ళినా సరే ఈ స్తంభాలు కనిపిస్తూంటాయి.

హైదరాబాదులో కూడా 'జూ' వుంది. అక్కడ మంచి మంచి రంగుల పక్షులున్నాయి. వాటిలోవింతైనవి, తెల్లని రామచిలుకలు, తెల్లని నెమళ్ళు. నువ్వెప్పుడైనా అట్లాంటివి చూచావా! ఇక్కడే పెద్దతోట కూడా వుంది. ఎప్పుడైనా నైజాంగారి రాణులు అక్కడికి షికారుగా వస్తారు.

హైదరాబాదులో మరోవింత కూడా వుంది. అక్కడి రూపాయలు, మన రూపాయల్లాగా వుండవు. వాటిమీద వుర్దూ అక్షరాలు, చార్‌మీనార్ బొమ్మలు వుంటాయి. ఆరూపాయలు మన వూరికి తెచ్చామా, ఎందుకూ పనికిరావు. అయితే మన రూపాయలు అక్కడ బాగా పనికొస్తాయి. ఆ రూపాయలు, అణాలు చేసేదికూడా హైదరాబాదులోనే! దాన్నే 'టంకశాల' అంటారు.

మన వుత్తరాలమీద బిళ్ళల మీద జార్జిరాజు బొమ్మవుంటుంది. హైదరాబాదులో వుత్తరాల మీద, బిళ్ళలమీద వుర్దూ అక్షరాలుంటాలు.

మన ప్రపంచంలో ఎన్నో దేశాలున్నాయి. అన్ని దేశాల్లోనూ, బాగా డబ్బుండే వాళ్లున్నారు. కాని వీళ్ళందరికంటె,- అనగా ప్రపంచంలో అందరికంటె ఎక్కువ డబ్బుకలవాడు మన దేశంలోనే వున్నాడు. మరెక్కడో కాదు! ఈ హైదరాబాదు నగరంలోనే! అతడే నైజాం!

1947 పంచాంగము క్యాలండరు (గ్లేజుకాగితము) **బహుమానము**

(5-0-0 లు పంపి పుస్తకములు తెప్పించుకొనువారికి పోస్టేజి ఉచితము. మరియు దేశనాయకుల త్రివర్ణచిత్రముగల 1947 సంll పాకెట్ క్యాలండరు బహుమానము)

# రమ్యమైన రాయల ప్రచురణములు

(తెల్లని గ్లేజుకాగితమున, పెద్ద అక్షరములతో ముద్దులు మూటగట్టునట్లు ముద్రింపబడినవి)

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | 0-2-0 | బాల రామాయణము | 0-2-0 |
| నారాయణ శతకము | 0-2-0 | సుమతి శతకము | 0-2-0 |
| కృష్ణ శతకము | 0-2-0 | గజేంద్ర మోక్షము | 0-4-0 |
| దాశరధి శతకము | 0-2-0 | రుక్మిణీ కల్యాణము | 0-4-0 |
| భాస్కర శతకము | 0-2-0 | నరసింహ శతకము | 0-4-0 |
| వేమన శతకము | 0-2-0 | అమరకోశము(ప్రకాండము) | 0-4-0 |

అనుభవజ్ఞులగు పండితులచే టీకాతాత్పర్యము వ్రాయబడినవి. ఆంధ్రదేశమునందన్ని ప్రాంతములలోను అందరిప్రజల ఆదరణపొందినవి. తెల్లని గ్లేజుకాగితమున అందమగు అచ్చులో తయారైనవి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సుమతిశతకము | టీకా. తా. | 0- 4-0 | భాస్కరశతకము | టీకా. తా. | 0- 8-0 |
| కృష్ణశతకము | ,, | 0- 4-0 | గజేంద్ర మోక్షము | ,, | 0- 8-0 |
| బాల రామాయణము | ,, | 0- 4-0 | రుక్మిణీ కల్యాణము | ,, | 0- 8-0 |
| నీతిశాస్త్రము (పాకెట్ సైజు) | | 0- 4-0 | అమరకోశము | ,, | 0- 8-0 |
| దాశరధిశతకము | ,, | 0- 6-0 | నరసింహశతకము | ,, | 0- 8-0 |
| నీతిచంద్రిక (144 పుటలు) | | 0-10-0 | ఆంధ్రనామ సంగ్రహము | ,, | 0-10-0 |

మద్దులేటి నృసింహ శతకము (కందపద్యములు, పాకెట్ సైజు) 0- 2-0
గృహ సరస్వతి (10 దినములలో ఇంగ్లీషు అక్షరములు నేర్చుకొనుటకు) 0- 4-0
పుష్పగిరి మాహాత్మ్యము 0-4-0 రాయల గణితబోధిని 0- 1-0

బాలలకు బహుమంచి పుస్తకములు "రాయల ప్రచురణములు"


బాలలు చక్కగా చదువుటకు అనుకూలమైనవి "రాయల ప్రచురణములు"

బాలలు పుస్తకము లెచ్చట కొనినను "రాయల ప్రచురణముల" కొనుట మంచిది


••• వివరములకు •••

**రాయలు అండు కో., పబ్లిషర్స్, కడప.**

# ★ బొమ్మల చిక్కు ★




సంక్రాంతి బాలలో వేసిన బొమ్మల చిక్కుకు సమాధానం ఇదుగో యీ పై బొమ్మలో చూడండి. ఈ బొమ్మల చిక్కు తయారుచేసినవా రెవరో తెలుసా?—మీ బొమ్మ లన్నయ్య శ్రీ వడ్డాది పాపయ్యగారు.




రచన: బి. వి. వి. ఆర్. సుబ్బారావు (జాతీయ రచనామండలి.)

అదిగో! అదిగో
పోస్టాఫీస్
అగపడుచున్నది
పోస్టాఫీస్!

* * *

ఇక్కడి సంగతు లక్కడకు
అక్కడి సంగతు లిక్కడకు
తెలియగ జాబులు వ్రాయంగ
కార్డులు కవరులు ఇచ్చుటకై
అదిగో! అదిగో
పోస్టాఫీస్!

* * *

పోస్టాఫీసుకు వెళ్ళినచో
ఉత్తరములను వేయుటకై
అగపడు అచ్చట పెట్టొకటి
ఎరుపు రంగున వుండునది
తపాల పెట్టని దానినియే
పిలుతుముమనము అందరము.

* * *

పెట్టెలో వేసిన వుత్తరము
పోస్టాఫీసున ప్రతిరోజు
బైటికితీసి ముద్రలను
వేసి సంచులలో పడవేసి
సంచులు రైలుకు పంపుదురు

* * *

రైలుబండి ఆ సంచులను
ఎక్కడి సంచులు అక్కడనే
ఇవ్వగ పోస్టాఫీసునకు
సంచులు తెచ్చి విప్పుదురు.
ఎవరిజాబులు వారికియే
ఇచ్చును అప్పుడు పోస్టుమేన్—

* * *

తంతి వార్తలను పంపంగ
ఒకరికి ఒకరు డబ్బైనా
పంప వలసినను పోస్టునను
పోస్టాఫీసుకు పోవలెను.
అన్ని విధముల ప్రజలకును
సౌకర్యంబులు కలిగించే
పోస్టాఫీసులు కావలెరా!
అదిగో! అదిగో
పోస్టాఫీస్!

# సోము సెలవుత్తరము



రచన: ఎస్. వి. లక్ష్మీనారాయణరావు, గుడివాడ.

సోముకి బడికి వెళ్లాలని లేదు. బడికి సెలవు వుత్తరం రాశాడు. ఆ వుత్తరం అంతా అబద్ధాలే - ఇదుగో చదవండి వుత్తరం :

మదరాసు,
జనవరి 23 వ తేది

మాష్టరుగారికి -

నాకు నిన్నటినుంచీ పెద్ద జ్వరంవచ్చింది. నడవలేను. అందుచేత బడికి రాలేను. సెలవు యిప్పించవలెను.

"సోము"

ఈ వుత్తరం బడికి ఎవరు తీసుకెళతారు? అబద్ధం వుత్తరం ఎవ్వరూ తీసుకొని వెళ్లలేదు. సోముకి కోపం వచ్చింది. "సరే! ఎవ్వరూ తీసుకొని వెళ్ళకపోతే ఉత్తరం వుండిపోతుందా? నేనే తీసికెళతాను"—అని సోము గబగబ తానే బడికివెళ్లి మాష్టారుకి ఉత్తరం ఇచ్చాడు. మాష్టారూ, బడిపిల్లలూ అందరూ ఫక్కున నవ్వారు. ఎందుకు నవ్వారో తెలుసా?

# ★ పోస్టు బంట్రౌతు ఆట



1. కాకినాడ.　　2. కర్నూలు,　　3. గుంటూరు,

4. వాల్తేరు,　　5. బళ్లారి,　　6. రాజమండ్రి,

7. బెజవాడ,　　8. బందరు,　　9. బరంపురం,

10. నెల్లూరు

ఇలాగ మీ ఇష్టంవచ్చిన వూరిపేర్లు పెట్టుకోవచ్చును.

# ఎలాగ ఆడడం అంటే ★

[ఈ ఆట ఆడుటకు ఎంతమంది ఎక్కువగా ఉంటే అంత బాగుంటుంది. ముప్ఫయిమందివరకు వుండవచ్చును.]

ఒకనిని పోస్టు బంట్రోతుగాను, మఱియొకనిని పోస్టు మాస్టరుగాను చేసి మిగతా పిల్లలందరూ వారిచుట్టూ గుండ్రముగా కూర్చుంటారు. వారందరూ తలకొకఊరిపేరు చెప్పుతారు. పోస్టు బంట్రోతు ఎవరు ఏవూరిపేరు చెప్పిందీ జ్ఞాపక ముంచుకోవాలి.

అప్పుడు పోస్టుమాస్టరు పోస్టు బంట్రోతును అందులో ఏదోఒక వూరికి వెళ్లమంటాడు, ఆ వూరికి వెళ్లాలి. అంటే ఆ ఊరిపేరు చెప్పిన పిల్లవాని దగ్గఱకువెళ్ళి నిలుచోవాలి. ఆ ఊరిపేరు చెప్పినవాని దగ్గఱకుపోక మఱియొకని దగ్గర నిలుచుంటే ఆ పిల్లవాడు పోస్టు బంట్రోతు కాలిమీద తన చేతితో 'ముద్ర' అనగా నొక గ్రుద్దు వేస్తాడు. ఈ పోస్టు బంట్రోతు సరిగా ఆ ఊరిపేరు చెప్పిన వాని దగ్గరకేవెళ్లి నిలుచో కలిగితే ఆ పిల్లవాడు నిలుచుంటాడు. ఇత డతని స్థలములో కూర్చుంటాడు. నిలుచున్న పిల్లవాడు ఏ ఊరికి వెళ్లమంటారని పోస్టు మాస్టరును అడుగుతాడు. అంటే ఆ పిల్లవాడు పోస్టు బంట్రోతు అవుతా డన్నమాట.

ఈ విధముగా అందరు పిల్లలు పోస్టు బంట్రోతు లయ్యే వఱకు ఆట సాగుతుంది.

సంపాదన : పాలంకి రామకృష్ణారావు
మూడోఘారం (కాకినాడ)






# * పేరు మరిచిన ప్రమీళ *

★ ★ రచన: శిష్ట్లా ఉమామహేశ్వరరావు ★ ★

రాకుమారి ప్రమీళకు రారాని మరుపు కలుగుతూంటుంది.

ప్రమీళ పసితనంలో ఏడుగురు దాదులమధ్య పెరిగింది. అంత పసితనంలోనూ ఆపిల్లకు ఆ మరుపుగుణం అగుపడుతూనే వుండేది.

బాల్యంలో ప్రమీళకు ఏడుగురు ఉపాధ్యాయులు చదువు చెప్పేవారు. అప్పుడూ ఆ పడుచుకు ఎంచరాని మరుపు వుండేది. అందుకు చెలికత్తెలు హేళనచేసేవారు. ప్రమీళమాత్రం నవ్వుతూండేది. ఆనవ్వు చూచేవారికి కోపాలుపోయేవి. ఏంచేస్తారూ?

పడుచు ప్రమీళ ప్రౌఢయైన తర్వాత దాదులూలేరు, ఉపాధ్యాయులూలేరు. తండ్రి, రాజ్యం కోల్పోయి అడివిలో ఆశ్రమం కట్టుకుని జీవిస్తున్న కారణంవల్ల ప్రమీళకు చెలికత్తెలూలేరు.

ప్రమీళలోమరుపుగుణంమాత్రం పుట్టుమచ్చల్లే వదిలిపోలేదు.

తండ్రికి అన్నంవండిన తర్వాత కూర వండడం మరిచిపోయేది.

ప్రమీళతండ్రి దొడ్డరాజు. కూతురంటే గారాము. పైగా రాజ్యం పోయిందన్న మహాదుఃఖం. అందుచే రానురాను ఆయనా మరిపిప్పియైనాడు.

ఓరోజున ప్రమీళ పెద్ద పొరబాటుచేసింది. ఆరోజునే నాగ

ప్రభువును పెండ్లాడడానికి నిశ్చయమైన రోజు. ఆమాట మరిచి అడివిలో పూలెలా కాస్తున్నాయో చూతామని పెందరాడే వెళ్ళింది.



అంతకు వారానికిమునుపు ఓ పెద్ద గుబ్బపురాతు దొడ్డరాజు అడివి దివాణానికి వచ్చాడు. ఐశ్వర్యవంతుడైన నాగప్రభువు ప్రమీళ సౌందర్యాన్ని మెచ్చి ఆమెను పెండ్లాడ నిశ్చయించాడని వార్త తెచ్చాడు. ఆమాటవిని ప్రమీళ "ఆముసలి రాజును చచ్చినా పెండ్లాడను" అంటూ అడివిలోకి పరుగెత్తుకు పోయింది. కాని నాగరాజు ముసలివాడైనా తనతండ్రి దొడ్డరాజుకు అనేక వూళ్ళనూ ధనమునూ ఇచ్చి బహూకరిస్తాడన్నమాట విని, ప్రమీళ తండ్రి దౌర్భాగ్యమైనా తీరుతుంది, ఎందుకీ అడివిన వెన్నెలలా అడివిలో అందం అనుకుని ఒప్పుకుంది.

మరుపు కలిగినదైనా ప్రమీళ మనసు మంచిదే!



ఆనాడే పెండ్లి. ఆనాటిని మరిచి అడివి పూలు ఏరుకొచ్చుకుందామని వెళ్ళింది

నాగరాజు సిబ్బంది దొడ్డరాజువద్దకు వచ్చి పెండ్లికై ప్రమీళను కొంచుకు పోదామని చూస్తే యేదీ? పొద్దుకూకే దాకా చూశారు. రాలేదు. వెనక్కు తిరిగిపోయారు.

అడివిలో ప్రమీళ, గెంతుతున్న ఉడుతలనూ కూస్తున్న పిట్టలనూ, మేస్తున్న మందలను చూస్తూ మిగతావన్నీ మరిచిపోయింది.

ఇంతలో ఆదారినే ఓనవయవ్వన రాజకుమారుడు నిర్భయంగా మహా ఠీవితో పంచకల్యాణీ గుర్రమెక్కి యీలతో పాట పాడుతూ వచ్చాడు. అతన్నిచూచి ప్రమీళ పూలనేరుతూన్నట్లు నటిస్తూ కూర్చున్నది.

"ఓ లలనామణీ! యీ అడివి యెవరిది చెపుమా!" అన్నాడు రాకుమారుడు.

"ఈ అడివి దొడ్డరాజుది" అన్నది ప్రమీళ.

"ఓహో! రాజ్యంలేని రాజుదా!" అని నవ్వాడు రాకుమారుడు.

"ఇప్పుడలాగే అంటున్నారు" అని విచారకరంగా పలికింది ప్రమీళ.

"ఆయనకు మహా అందమైన కూతురున్నదిట కదూ?" అని అడిగాడు రాకుమారుడు. ఎదుటవున్న అందకత్తెను విడిచి పోవడానికతని మనస్సు ఒప్పలేదు. ఏం అడగాలో తెలియలేదు.

"ఆమె అందంగురించి తెలుసుకోవాలంటే నీకు నీవే తెలుసుకోవాలి" అన్నది ప్రమీళ—తలవంచి కానరాకుండా నసుగుతూ.

"ఆఁ! తెలుసుకుంటా ఎక్కడున్నదో చెపితే. కాని నీకన్న అందంగా వుండదనుకుంటాను."

ఆమాటకు అతన్నిచూచి ముఖానే పక్కునవ్వింది ప్రమీళ. అందుకతను ముఖం చిట్లించగానే "నేనే రాజ్యంలేని రాజు కూతుర్ని" అన్నది.

ఆమాటలకు రాకుమారుడు చికాకుపడ్డాడు. అంతటితో వెనక్కుతిరిగి వెళ్ళుతాడనుకుంది ప్రమీళ. కాని చివరకు అతడూ నవ్వాడు. వెంటనే పాతస్నేహితులులా ఇద్దరూ పొద్దుపోయేదాకా సరదాగా కూర్చున్నారు.

చీకటి పడపోయే సమయానికి తన పెండ్లిసంగతి ప్రమీళకు

జ్ఞాపకానికొచ్చింది. "అమ్మయ్యో!" అంటూ మారు మాటాడకుండా చటుక్కునలేచి పరుగెత్తిపోయింది.

ఇంటికి రాగానే దొడ్డరాజాపడుచును చూచి "నీకివ్వాళ పెళ్ళిరోజని జ్ఞాపకంలేదనబోకు!" అన్నాడు.

కోపపడకు నాన్నా, నీకుకూడా మరుపు యేర్పడింది కదూ. ఇంకేం, పోనీలే, నాగరాజు యేడీ?"

"వెళ్ళిపోయాడు. ఎంతసేపుంటాడు?"

"అమ్మయ్య! పోనీలే!"

"ఊహూఁ! నీవింటికిరాగానే అతని వెనకాలే రావాలని కబురుచెప్పిపోయాడు. జీనుగుర్రాన్నికూడా వదిలిపోయాడు."

"ఓహో!" అంటూ ప్రమీళ తనగదిలోకి పోయింది.

గదిలో కిటికీలోంచి బయటకు చూచేసరికి అడివిలో అగుపడిన రాకుమారుడు తలంపుకొచ్చాడు. అట్లాగే ఆలోచిస్తూనుంచున్నది ప్రమీళ.

ఆమె యంతసేపటికీ రాకపోయేసరికి తండ్రి కేకవేసాడు. ఆకేకకు ఆమె గబగబా నాలుగుగుడ్డలను చేతబట్టుకుని వాకిటికి వచ్చి తండ్రికి నమస్కరించి గుర్రమెక్కింది.

చీకటయినా ప్రమీళ చీకుచింతా లేకుండా స్వారిచేస్తూ పోయింది. అడివిఅంతా ఆమె యెరిగిందే!

నాగరాజు కోటదరికి ప్రమీళ చేరి వాకిలి తట్టింది.

"ఎవరు వారు?" అని లోనించి ఎవరో అడిగారు.

"ఎవరా?" అని దర్పంగా ప్రమీళ అంటూనే తనపేరు మరిచి తడబడింది.

"ఎవరంటే" అని లోనుంచి మళ్ళీ అడిగారు.

"నేను రాజకుమారిని" అనిమాత్రం అనగలిగింది ప్రమీళ.

ద్వారపాలకుడు పోయి రాజుగారితో తెలిపాడు. రాజు

కామె యెవరో తెలుసు. కాని ఆమెను లొంగతీద్దామనుకుని పేరు చెబితేగాని వీలులేదని కబురు పంపాడు.

ఎంత ఆలోచించినా ప్రమీళకు తనపేరు జ్ఞాపకంరాలేదు. అందువల్ల వేరేమీ చేయలేక వెనక్కే వెళ్ళిపోయింది. తండ్రిని చూచి జరిగినదంతా చెప్పింది.

"అరెరే! పేరే మరిచిపోయావా? మరింకేమిటి?" అన్నాడు దొడ్డరాజు.

"పోనీ నాపేరు జ్ఞాపకం చెయ్యరాదూ!" అన్నది ప్రమీళ.

"నీపేరా? నీపేరు 'పేరూ!' కదూ?" అన్నాడు దొడ్డరాజు.

"అది నాముద్దుపేరు. అసలుపేరో?"

"అసలుపేరా? నేనూ మరిచానే! అయ్యయ్యో!" అని దొడ్డరాజు గాభరాపడుతూ "సరే నీపేరు తెలిపినవాళ్లకు నా రాజ్యంలో సగమిస్తానని ప్రకటన చేయిద్దాం" అన్నాడు.

"ఏంమాటలు నాన్నా. మనరాజ్యం పోయి యెన్నాళ్లయింది!"

"అయినా అట్లాగే ప్రకటించాలి" అని దొడ్డరాజు అట్లాగే ప్రకటింప చేశాడు.

ఎన్నిరోజులయినా ఎవరూ అతీగతీలేదు.

"నేను సింహాసనంమీదే వుంటే నాప్రకటనకు లక్షలకొలదీ వచ్చేవారు చూచావా?" అన్నాడు దొడ్డరాజారోజున.

"పోనీలేద్దూ నాన్నా, పేరు జ్ఞాపకం రాకపోతే యిప్పుడేం పుట్టి మునిగింది" అన్నది ప్రమీళ.

ఇట్లా వుంటుండగా ఓరోజున అడివిలో ప్రమీళను కలుసుకుని మాటాడిన రాజకుమారుడు దొడ్డరాజును చూడడానికి వచ్చి "నేను మీకూతురు పేరు చెబుతాను. అయితే ఒకషరతు. ఆమె నన్నే పెండ్లాడాలి" అన్నాడు.

"నువ్వెవరవో నాకేం తెలుసు" అన్నాడు దొడ్డరాజు. "అయినా మా అమ్మాయి ఇష్టపడుతుందో లేదో?"

"మీ మొదటి ప్రశ్నకు సమాధానం: నేను ఇక్ష్వాకు రాకుమారుడ్ని. రెండవదానికి సమాధానం: మీ అమ్మాయినే పిలిచి అడగండి" అన్నాడు ఆ వచ్చిన రాజకుమారుడు.

ప్రమీళ రాగానే "ఏమి ప్రమీళ రాజకుమారీ! నన్ను పెండ్లాడుతావా?" అని ఇక్ష్వాకు రాజకుమారు డడిగినప్పుడు ప్రమీళ బుగ్గలను చూచిన దొడ్డరాజుకు సంకోచమంతా తీరింది. ఇద్దరినీ చెరోచేతితో పట్టుకుని ఇలా అన్నాడు!

"ఇక్ష్వాకు రాజునకు ఇల్లాలువైతే యింకేం, ఇలవేల్పులు గూడా ఇష్టపడి ఆశీర్వదిస్తారు!"

---

మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్నయెడల వెంటనే
పాత్రుడుగారి
బాలసంజీవిని
యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.
వివరములకు :—
డా|| పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు.
11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి :
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి :
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం.




రచన: దేవకీనందన

"తుమ్మితే ఊడిపోయేముక్కు ఎంతకాలం వుంటుందీ''— అని ఒక సామెత వుంది తెలుసా?—తుమ్ము సాధారణంగా అందరికీ వస్తుంది. కాని, ఎక్కువగా రొంప పట్టేముందు వస్తుంది.

ఎవరైనా తుమ్మితే అది అపశకునం అంటాం. ఎందుచేత? వంట్లో అనారోగ్యాన్ని సూచించడానికి తుమ్ము వస్తుంది గనక.

ఏది ఎలాగున్నా తుమ్మినపుడు ఏమి జరుగుతుందో తెలుసా? మన ముక్కులోనుండి, నోటినులోనుండి 1,00,000 కి పైగా వ్యాధిని కలుగజేసే సూక్ష్మజీవులతో కూడిన పరమాణువులు, గంటకు 100 మైళ్ళ వేగముతో గాలిలోనికి పోతాయి. ఈ సూక్ష్మజీవులు గాలిలో అరగంటకు పైగా వుంటాయి. అంచేత మనం యీ అర్థగంట కాలంలో పీల్చే గాలిలో సుమారు 1,200 ల సూక్ష్మజీవులేనా వుంటాయి! అలా పీల్చినవారికి వ్యాధి రావడానికి అవకాశాలు వున్నాయి.

ఇది ఎలాగ తెలిసిందంటే - ఒకరు తుమ్మినప్పుడు వచ్చిన తుంపరలు ఒక రేకుమీద పడేటట్లు రేకును ఆయనకు మూడు అడుగుల దూరంలో పెట్టారు. ఆ రేకుమీద తుంపరలుపడ్డ కొద్ది కాలానికే వ్యాధిని కలిగించగల 19,000 సూక్ష్మజీవులు కనుపించాయట.

అందుచేత మనం తుమ్మినప్పుడు మూతికి, ముక్కుకు జేబురుమాలును అడ్డంపెట్టుకుంటే, సూక్ష్మజీవులు గాలిలోనికి పోవు.


జబ్బుగా వున్నవారికి తుమ్ము వస్తే అది ఆరోగ్య సూచన అంటారు. ఎందుకో తెలుసా? - జబ్బును కలుగజేసే సూక్ష్మజీవులు తుమ్ముద్వారా రోగి తరిమివేస్తున్నాడు గనుక.

ఇటలీ దేశంలో ఎవరైనా తుమ్మితే అది శుభసూచకంగా తీసుకుంటారు. "తుమ్ము మన శరీరం అనే ఇంటి ముందు వసారా తుడవడం లాంటిది" అని ఒక డాక్టరు అన్నాట్ట!

## ఆకులు - లతలు

తెలుగు బాలురూ తెలుగు బాలికలూ మంచి బొమ్మలు వేయుగలరు.

ఈ బొమ్మ చూడండి ఇందులో మన చిత్రకారుడు ఎ. బాలకృష్ణరావు, "బాల" అను అక్షరాలు ఎలాగ రాశాడో!




# కూచిపూడి నాట్యం - శ్రీశర్మ

రచన : శ్రీ రామాచార్యులు.

కమ్మగా పాడితే సంగీతమని, చక్కగా ఆడితే నాట్యమని, అందంగా బొమ్మలు వేస్తే చిత్రలేఖనమని అంటారు.

పాడడం, ఆడడం, బొమ్మలువేయడం మొదలైన వాట్ని కళ లంటారు.

అందంగా వుండి, కమ్మగా పాడుతూ, చక్కగా ఆడితే నాట్యం బాగా వుంటుంది.



వేదాంతం జగన్నాథ శర్మ.

నాట్యం అనేటప్పటికి మన దేశంలో "కూచిపూడి" జ్ఞాపకానికి వస్తుంది. కూచిపూడి నాట్యానికి పుట్టినిల్లు. కూచిపూడివారు — బ్రాహ్మణులు — చిన్నప్పట్నించి ప్రతివారూ నాట్యం నేర్చుకుంటారు, నాట్యం వారికి కులవిద్య. ఒక్క మొగవాళ్ళే నాట్యంచేస్తారు. వారిలో అందమైన కుర్రాళ్ళచేత ఆడవేషాలు వేయిస్తారు.

మనలో చిన్నప్పుడు అక్షరాభ్యాసం ఎలా చేస్తారో అలాగే కూచిపూడిలో వారు చిన్నప్పుడే ప్రతి కుర్రాడ్ని ఆ వూళ్ళోవున్న దేవాలయంలో మొదట గజ్జెకట్టించి నాట్యం చేయిస్తారు. అలా చేయందే మరెక్కడా నాట్యం చెయ్యరు.

రామ నాటకం, ప్రహ్లాద నాటకం మొదలైన నాటకాలన్నీ నాట్యంతో ప్రదర్శిస్తారు. తరంగాలు, అష్టపదులు, గొల్ల కలాపం, భామ కలాపం, దశావతారాలు యింకా, యింకా ఎన్నో చక్కగా ఆడి, అందర్నీ ఆనందింప జేస్తారు.

అలా ఆడేవారిలో వేదాంతంవారు, వెంపటివారు, పసుమర్తివారు మొదలైనవారు ఆ నాటకాలు దేశమంతటా ఆడుతూ పెద్దపేరు సంపాదించారు.

అలా పేరు సంపాదించిన వారిలో శర్మగారు ఒకరు.

మద్రాసులో మన "కేసరి" గారి స్కూల్లో "నర్తనశాల" పెట్టి కూచిపూడి నాట్యాన్ని నేర్పుతున్నారు.

బాలలందరూ మన సాంప్రదాయకమైన నాట్యాన్ని నేర్చుకుని "నర్తన బాల" లవుతారుగదూ !

# బర్మాలో
# * "క" గుణింతం *

రచన: సిద్ధాంతి వెంకటరమణాంబ

బర్మా దేశంలో 'మాండలే' అనే గొప్ప నగరముంది. ఆ పట్టణంలో చాలామంది తెలుగు వాళ్లు నివసిస్తున్నారు. ఆ వూళ్లో ఒక హైస్కూలుండేది. తెలుగు పిల్లలందరు ఆ బడికే వెళ్లేవారు.

ఆ బళ్లో తెలుగు తెలిసిన పంతులొకడుండేవాడు. తెలుగు వాళ్లందరు ఆ పంతుల్ని తమ పిల్లలకి తెలుగు నేర్పమని కోరారు. ఆ పంతులు సంతోషపడి అందు కొప్పుకున్నాడు. ఒ న మ లు, గుణింతాలు, పాఠాలు అన్నీ నేర్పే వాడా పంతులు.

ఒకసారొక గమ్మత్ జరిగింది. ఒకబ్బాయి, క, గుణింతం నేర్చు కుంటూన్నాడు. చివరకొచ్చాడు. ఆ పంతులిలా చెప్పాడు. "క, పక్కన సున్న బెడితే కం అవుతుంది" అని. వాడేం చేశేవాడంటే-క, పక్కన సున్న బెడితే కం, క ముందు సున్న బెడితే "ంక" (ఉంక) అని చదివేవాడు. తోటి పిల్లలందరు పకాలున నవ్వేవారు.

ఎన్నోమార్లు వాణ్ణి ఆ పంతులు, అట్లా చదివితే తప్పు, చదవ్వద్దని బెదిరించాడు. కాని వాడు మానలేదు. 'ఉంక, ఉంక' అని ఎప్పటిలాగ చదువుతూనే వుండేవాడు.

చూచిచూచి ఆ పంతులొక సారి వాళ్ల తరగతికెళ్లి "ఒరేయ్! మీరందరు యికమీదట వాణ్ణి "ఉంక, ఉంక" అని పిలవండర్రా" అన్నాడు. పిల్లలందరు గొల్లున నవ్వారు. అప్పటినుంచి వాణ్ణి "ఒరె! ఉంక, ఒరే! ఉంక" అని పిల్చేవారందరూ. పాపం, వాడు సిగ్గుపడి అట్లా చదవటం మానేశాడు.

మీరుమాత్రం అట్లా చదవకండేం.

# అంకెలలో పద్ధతి

ప్రతీ విషయంలోనూ ఒక పద్ధతి వుంటుంది. అలాగే అంకెలలోకూడా పద్ధతి వుంది. పద్ధతి లేకపోతే ఏదీ అర్థంకాదు.

ఇప్పుడు చూడండీ - అంకెలు వరుసగా రాయాలంటే 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11—ఇలాగ రాస్తాము. ఒక అంకె విడిచి అంకె రాయాలంటే 1, 3, 5, 7, 9, 11—ఇలాగ రాస్తాము.

ఈ విధంగా ఈ దిగువున ఒక అంకెల వరుస ఇవ్వబడింది. ఆ వరుసలో ఖాళీగావున్న అంకెలు పూర్తిచేయగలరూ ?

**1, 2, 4, 7, —, —, 22**

[జవాబు మార్చి సంచికలో చూడండి.]


## రీటా తలవెండ్రుకలను పెంచును




రీటా కురుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును, సీసా 15అ.

**RITA**

**HAIR TONIC**






శ్రీ వజ్ఝల వేంకటేశ్వరకవి, బి. ఏ., బి. యిడి., జయపురము.

## 1

బయటను కత్తులుదాల్చిన పహరా
జవాన్ల సంచారం;
లోపల ఉన్నది మేలిమివన్నెల
మెత్తని బంగారం;
నల్లత్రాచులకు చాలాప్రియమై
నట్టి అలంకారం;
మీ తలకెక్కిన దేమొ చెప్పితే
మీకే ఉపహారం.

## 2

తలా తోకా ఒకటి, నడుము శూన్యము గాని
మూడు త్రోవలబట్టి, పయనమై పోతుంది.

## 3

తోటిబాలురలోన చిన్నవాడేకాని
పెద్దవాడైనట్లు రూపించుతాడు;
ప్రతిరోజు బడిమేడ మెట్లెక్కి దిగుతాడు
బడికిపోవుటలోన తప్పడొకనాడు;
అతడు వస్తాడంటె అదియేమి చిత్రమో
బడిపిల్లలందరూ తెల్లబోతారు;
అతడు పోతాడంటె ముఖవికాసములతో
హాసరేఖలతోడ భాసిల్లుతారు.

[జవాబులు మార్చి సంచికలో]



# జంట పక్షులు

రచన : చింతా బాలంభొట్లు, నరసాపురం.

- నిర్మలంబగు ఆకాశమున
నిత్యమల్లి తోటొకటుంది
తోటదగ్గర సరసొకటుంది
సరసు వద్దున వృక్షములోపల
వుండెను పిట్టలజంటొకటి.

* * *

- అతి సౌఖ్యముతో ఆనందముతో
కాపుర ముండెను ఆ రెండున్
దగ్గరవుండే దేవళంబులో
దేవుని కొలిచెడి వారెండున్.

* * *

- పూవులు కాయలు తెచ్చి వుదయమే
పూజను సలిపే వారెండున్
జంట పక్షుల భక్తిని చూచి
తోటి పక్షులు నవ్వేడివి.

* * *

- నవ్వినన హేళన గావించినను
ఈశుని భక్తితో కొలిచేవి

ఈశుడు పక్షుల భక్తికి మెచ్చి
ఇచ్చె నెన్నియో వరములను.

* * *

ఈ మార్గంబున శివుని గొల్చుచూ
కాలము గడిపెడి వారెందున్
శివరాత్రనియెడు ఈశుని పండుగ
వేగమె వచ్చెను ఒకనాడు.

* * *

సంతోషంబున లేచి వుదయమే
స్నానము చేసెను ఆరెండున్
అస్తమానమే పూజలు సలిపీ
నిద్ర పోయెను ఆరెండున్.

* * *

కాకుల గుంపులు కల కల కూసెను
కిరణా లప్పుడే రాజొచ్చెన్
కిల కిల నవ్వెను తామర పువ్వులు
పూజా రింకను రాడాయె.

* * *

ఈశుని పూలతో పూజించుటకై
ఈశుని చేరెను పూజారి
దేవుని ఒడిలో మైమర చుండిన
పిట్టల చూచెను పూజారి.

● పిట్టల జంటను చూచి నంతనే
వచ్చెను కోపము పూజారయ్యకు
కోపము తోటి కర్ర పుచ్చుకొని
పక్షుల కొట్టెను పూజారి.

* * *

● ఏమాశ్చర్యము! ఏమాశ్చర్యము!
జంట పక్షులు లేవాయె!
కొట్టిన దెబ్బలు శివునకు తగిలిన
భక్తుల కాచెను శివుడంతన్.


# 'తెలుగు తల్లి'

● ఈ పుస్తకం మీరు చదివారా?

పిల్లల కోసం
ప్రత్యేకంగా
100 బొమ్మలతో
అచ్చువేసిన
రంగు రంగుల
పుస్తకం
●

మనదేశం, మన ఆంధ్రదేశం, మనభాష, మన ఆటలూ, మన పాటలూ, మన పరిశ్రమలూ, మన నాయకులూ, మన పెద్దల గురించి మీకు ఎన్నో సంగతులు శ్రీ మాగంటి బాపినీడు గారు యీ పుస్తకంలో చక్కగా రాశారు. , వెల 2 రూ.

పుస్తకం పట్టుకుంటే వదలరు. బలే రక్తిగా వుంటుంది. ప్రతి ఇంట్లోనూ, ప్రతి బడిలోనూ వుండవలసిన పుస్తకం.

ఈ దిగువ యడ్రసుకు వ్రాసి తెప్పించుకోండి :

మేనేజరు : జాతీయ జ్ఞానమందిరము
త్యాగరాయనగరము, మదరాసు 17.

# గొలుసు మాట

ఆనందం ఆనందం
ఏమి ఆనందం ?
బాలానందం ?
ఏమి బాల ?
ముద్దు బాల
ఏమి ముద్దు ?
పండు ముద్దు
ఏమి పండు ?
పనస పండు
ఏమి పనస ?
వేరు పనస
ఏమి వేరు ?
తెల్ల వేరు
ఏమి తెల్ల ?
నూలు తెల్ల
ఏమి నూలు ?
వడకు నూలు
ఏమి వడకు ?
రాట్నము వడుకు
ఏమి రాట్నము ?
హింద్ రాట్నము
ఏమి హింద్ ?
జై హింద్ !

రచన : మండపాక వెంకట పద్మావతి.
(టపాంగ్.)




EASTERNS 379.

# కొంటె కిష్టయ్య చమత్కారం

డి. ధనంజయ, 3-వ ఫారం.
డి. తిమ్మేస్వరరావు, 1-వ ఫారం.
తణుకు.

ఆరోజున స్కూలుకి ఇనస్పెక్టరుగారు వస్తున్నారు. హిస్టరీ, జాగ్రఫీ అన్నీ జాగ్రత్తగా చదువుకుని రమ్మన్నారు మేష్టారు. కిష్టయ్య ఏం చదవలేదు. రాత్రి అంతా హాయిగా పడుకుని ఉదయం బొమ్మలువేస్తూ కూర్చున్నాడు. పదిగంటలకి మాత్రం తెల్లని బట్టలు కట్టుకుని స్కూలుకు వెళ్ళాడు.

రోజూ కిష్టయ్యని ప్రార్థన చదవమని మేష్టారు అడుగుతారు. ఈసారి తను స్వంతంగా ఒక కొత్త ప్రార్థన రాసి మేష్టారినీ, ఇనస్పెక్టరుగారినీ నవ్వించాలనుకొన్నాడు. లేకపోతే పేకబెత్తం దెబ్బలు తగులుతాయని కిష్టయ్య భయం, "శ్రీ రుక్మిణీశ కేశవ" వరుసలో స్వంతంగా రెండుపద్యాలు యతీప్రాసాలేకుండా తయారుచేశాడు.

ఇనస్పెక్టరుగారూ మేష్టారూ కలిసి గంటకొట్టగానే స్కూలుకి వచ్చారు. "కిష్టయ్యా ! ప్రార్థన చదువు" అన్నారు మేష్టారు. ఎంతో వినయంగా, భక్తిగా లేచి కిష్టయ్య యిలాగ చదివాడు :

"రాత్రుళ్లు కిరసనాయిలు
వ్రాయగ తెలకాగితాలు వరుసగ లేందే

ఏలాగు చదువుకోడం
బాలురము మమ్ముకరుణ కాచుము తండ్రీ.''
అందుకు మాపై కోపం
ఎందుకినస్పెక్టరుగారు? ఎంతో భక్తిక
వందన మొనరింతుము, మా
మందను దయతోడబ్రోవు మయ్యా యెపుడున్.

ఇలాగ చదివినందుకు ఇనస్పెక్టరుకి కోపం వస్తుందని మేష్టారు భయపడ్డారు. కాని ఇనస్పెక్టరు నవ్వి 'సెభాష్, బాగా తెలుగు పుస్తకాలు చదువుతూ వుండు. ఇంకా మాంచి పద్యాలు రాస్తావు.' అన్నారు. కిష్టయ్యకి ఎంతో ఆనందం కలిగింది.

తర్వాత ఇనస్పెక్టరుగారు కొన్ని ప్రశ్నలిచ్చి జవాబులు వ్రాయమన్నారు. అందరూ జవాబులు వ్రాశారు. కిష్టయ్యకి కొన్నింటికి జవాబులు తెలుసును, కొన్నిటికి తెలవదు. అందు కోసం అన్నింటికీ గమ్మత్తుగా జవాబులురాస్తే, ఇనస్పెక్టరుగారు మెచ్చుకుంటా రనుకున్నాడు. అందరిజవాబు కాగితాలూ ఇన స్పెక్టరుగారు తీసుకుని చదివారు. కిష్టయ్య జవాబులు యిలాగ చదివారు.

1. ప్రశ్న:- ప్రత్తి ఎక్కడ దొరకును?
జవాబు:- మా బామ్మ వత్తులపెట్లో దొరకును.

2. ప్రశ్న:- అశోకుడెవరు? ఏమి చేసెను?
జవాబు:- అశోకుడు పెద్ద తాపీవాడు. ఇతడు, ఇళ్ళూ, తటాకములూ, దేవాలయములూ కట్టించెను.

3. ప్రశ్న:- ఒక గుఱ్ఱము గంటకు యిరవై రెండున్నర మైళ్ళు చొప్పున నలభైయారు గంటలకు ఎంత దూరము వెళ్ళును ?

జవాబు:-చచ్చి స్వర్గమునకు వెళ్ళును.

4. ప్రశ్న:- సిపాయి కలహమననేమి? ఎప్పుడు ఎక్కడ జరిగెను? ఫలితము లేమి ?

జవాబు:- నిన్నరాత్రి మా యింట్లో మా అమ్మకూ నాన్నకూ జరిగెను. ఫలితము గొంతుక బొంగురు పోయెను.

5. ప్రశ్న:- టాజమహల్ అననేమి ?

జవాబు:- మా వీధిలో ఒక పెద్ద బట్టలకొట్టు పేరు; బొంబా యిలో ఒక హోటలు పేరు.

6. ప్రశ్న:- గురువుగారి యెడల ఏల భక్తిని చూపవలెను?

జవాబు:- పేకబెత్తమును చూచి భక్తితో ఉండవలెను.

ఈ చమత్కారమైన సమాధానాలకి అందరూ విరగబడి నవ్వారు. అప్పుడు ఇనస్పెక్టరుగారు యిలా అన్నారు. 'కిష్టయ్యా' నువ్వు తెలివి గల కుఱ్ఱవాడివే! ఇటువంటి చమత్కారాలు సరదాగా ఉన్నా, పరీక్షలకి ఉపయోగించదు. నువ్వు అల్లరిమాని బాగా చదువుకో. ఈసారి నీ చమత్కారానికి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు రాసిన 'గణపతి' అనే పుస్తకం బహుమతి యిస్తున్నాను.'

అందరూ చప్పట్లు కొట్టారు. 'చిత్తం' అంటూ కిష్టయ్య సంతోషంతో బహుమతి తీసుకున్నాడు.

## చూచిన దంతా బంగారం!

లంకా ద్వీపంలో కొలంబో అన్న వూరుంది. ఆ వూళ్లో ఇద్దరు అమ్మాయిలు ఎదో పండు లోని గింజలు తిన్నారట. ఆ గింజలు తిన్న తరువాత వాళ్ళకంటికి ప్రతి వస్తువూ పచ్చగా బంగారంలా గకన బడుతోందట! చూచిన వస్తువులన్నీ బంగారంవే అను కొని అవి తీయబోతారట. ఇప్పుడు వాళ్ళని ఆసుపత్రిలో వుంచి చూస్తున్నారట.

మీరు మాత్రం తెలియకుండా అడ్డమైన కాయలూ, గింజలూ తినకండేం! కొన్ని కొన్ని కాయలు తింటే పిచ్చెత్తిపోతారు కూడాను!

★


## పెద్దలను అడిగి తెలుసుకో!


ప్రశ్న :- చెట్లకు బెరడు ఎందుకు వుండును ?

ప్రశ్న :- పువ్వులకు సువాసన దేవుడు ఎందుకు ఇచ్చెను ?

కె. అన్నపూర్ణాబాయి

(అనారా)






రచన: జనమంచి రామకృష్ణ

తెల్లారి లేవగానే, మన గుమ్మం ముందు వినబడేది, కనబడేది బీదరికము. కడుపు తరుక్కుపోయే దీనంతో "అమ్మా!" అని చేతులు చాస్తాడు బిచ్చగాడు. బిచ్చగాళ్ళలో ఎంతో మంది తెలివైన వాళ్లున్నారు.

బిచ్చగాళ్ళగురించి మీరెన్నో కథలు విని వుంటారు. నేను మీకు చెప్పబోయే కథ నవ్వూ జాలీకూడా కల్గిస్తుంది.

బొంబాయిలో ఒక బిచ్చగాళ్ల సంఘం ఉంది. ఆ సంఘంలోని బిచ్చగాళ్లంతా గుడ్డివాళ్లే! ఆ సంఘానికో పెద్ద ఉన్నాడు. గుడ్డిబిచ్చగాళ్లంతా, బొంబాయి పట్టణ వీధుల్లో బిచ్చమెత్తి, వచ్చిన డబ్బుల్ని, సాయంత్రం అయేసరికల్లా సంఘ పెద్దకిచ్చేవారట. ఆ పెద్ద, తనవంతు తాను తీసుకుని అందరికీ సమానంగా ఆ డబ్బంతా పంచేవాడు.

ఓరోజు సాయంత్రం సంఘ పెద్ద రోడ్డుపక్కని కూర్చుని "కళ్లులేని కబోదులం బాబయ్యా! ఒక్క కానీ దయ చేయండి!" అని బిచ్చమెత్తుకుంటున్నాడు. ఆ సమయంలో, ఒక మార్వాడీ, ఎందుకో చాలా ఆనందంతో నడిచిపోతూ గుడ్డివాణ్ణి చూచి "ఏయ్! అబ్బీ! చెయ్యిపట్టు!" అన్నాడు.

"ఈ డబ్బాలో ఎయ్యండి బాబయ్యా!" అన్నాడు బిచ్చగాడు.

"అలా కాదు! చెయ్యిపట్టు చెప్తాను!"

"ఎందుకండి బాబయ్యా! దమ్మిడీ అవనీండి, కానీ అవనీండి, అర్ధణా అవనీండి, ఆఖరికి రూపాయ అవనీండి, అందరు బాబులూ ఈడబ్బాలోనే యేస్తారు! మీరు దాంట్లోనే ఎయ్యండి!" అన్నాడు ఆ బిచ్చగాడు.

"అబ్బే! నేనిచ్చేది, కానీ, అర్ధణా, రూపాయీ కాదు! ఒరేయి అబ్బీ! చెయ్యిపట్టు మరీ! నీకే తెలుస్తుంది..ఊ! చాచాలి!" అని మార్వాడీ అనగానే, బిచ్చగాడు చివరకి చెయ్యిచాచాడు. బరువుగా ఏదో పడింది, వాడి చేతిలో. గుడ్డివాడు, చేత్తో, ఆ నాణాన్ని తడుముతూ ఆశ్చర్యపోయి ఆనందంతో "ఏంటి బాబయ్యా!" అని అడిగాడు.

"ఏమనుకున్నావు! మొహికీ! బంగారంది. పదహారు రూపాయల ఖరీదు!' అన్నాడు మార్వాడి.

బిచ్చగాడు ఆనంద భాష్పాలు రాలుస్తూ "బాబయ్యా! ప్రభువులు! ఆ భగవంతుడు మిమ్మల్ని రచ్చించాలి! బాబయ్యా! ఇటువంటి మొహిరీలు కొన్నిటిని కళ్లకద్దుకుంటే, నా గుడ్డితనం పోతుందేమో బాబయ్యా! ఆ అదృష్టం నాకు పడుతుందా! కళ్ళు లేని కబోదిని!" అన్నాడు దీనంగా,

మార్వాడీ జాలిపడి :

"ఒరే అబ్బీ! ఏమో నీ అదృష్టం ఎలా వుందో, ఎవరు చూడొచ్చారు...ఇదిగో మరో పద్నాలుగు మొహిరీలు ఇస్తున్నాను. కళ్ళకు అద్దుకుని వెంటనే నాకిచ్చెయి!"

బిచ్చగాడు, ఒక్కొక్క మొహిరీని కళ్ళకి అద్దుకుంటూ సంచీలో వేసుకుంటూ, "బాబయ్యా! కళ్లు లేని కబోదిని, ఒక్క రాగిడబ్బు దయసేయండయ్యా!" అంటూ వచ్చేపోయే వాళ్ళని అడగడం ప్రారంభించాడు. ఎంతకీ పద్నాలుగు మొహిరీలనూ ఇవ్వకపోడం చూచి, మార్వాడీ.

"ఒరేయ్! ఆ మొహిరీలు ఇలా తేరా!...సంచీలో వేసుకు అలా, ఏమీ ఎరగనట్లు ఊరుకుంటావేం...ఊ! ఇస్తావా! ఇవ్వవా!" అని దబాయించి అడిగాడు.

**తెలుసా**

మన రాజధానిలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న బీద పిల్లలకు ఉచితముగా బిస్కతులు పంచిపెట్టమని, నూజిలెండు గవర్నమెంటువారు 19,171 పెట్టెల బిస్కతులు పంపారు.

మార్వాడీ మొరవినిపించుకోక, పైగా, "ఏంటిబాబయ్యా! కళ్ళులేని కబోదిని ఇలా బాధపెడతారు! కామందులకి మేమంటే ఎంత లోకువ...పైగా బిచ్చం ఎత్తుకోనియ్యకండా అడ్డంగా నిలబడతారేంటీ... యెళ్ళండి ... యెళ్ళండి" అని బిచ్చగాడు ఎదుర తిరిగి బుకాయించడం మొదలెట్టాడు. కథ అడ్డం తిరిగింది. మార్వాడీకి, బిచ్చగాడికీ పడుతూన్న ఘర్షణ చూసి, జనం మూగారు. అందరూ, మార్వాడీని పట్టుకు కేకలేశారు. ఆఖరికి తన్నడానికి కూడా సిద్ధమయారు.

ఇంతలోకే, ఒక ప్లీడరువచ్చి, మార్వాడీని రెక్కపట్టుకు అవతలకి తీసుకుపోయి, "వాళ్లతో ఘర్షణ పడితే ఏం లాభం లేదు! ఇలారా!" అని పక్కకి తీసికెళ్ళి ఏదో రహస్యంగా సలహా ఇచ్చాడు. పుణ్యాం చేయబోతే, పాపం ఎదురైందా మార్వాడీకి. ఒక మొహిరీ దానానికి, పధ్నాలుగు మొహిరీలు జుల్మానాగా ఇచ్చుకున్నాడు.

కాని ప్లీడరు సలహా ఇచ్చాడుగా! మార్వాడీ దూరంగా వెళ్ళిపోయినా, బిచ్చగాణ్ణి కనిపెడుతూ అక్కడే నిలబడ్డాడు. ఇంతలోకే, బాగా చీకటిపడింది. తక్కిన గుడ్డివాళ్లంతా బిచ్చమెత్తిన డబ్బులు పట్టుకు సంఘపెద్దదగ్గిర చేరారు. వాళ్లనిచూసి, ఆసంఘ పెద్ద:

"ఒరేయి! మీరంతా నిర్భాగ్యులురా! రోజంతా గొంతుకు చించుకుంటూ బిచ్చమెత్తి, మహా తెస్తే, అర్థరూపాయ డబ్బులు తెచ్చేరు! చూడండి, నేను, ఎంత సులభంగా, ఎంత డబ్బు సంపాదించానో!" అని మొహిరీల సంచి, కుదుపుతూ చూపించాడు. అందరూ, "ఏదంటే ఏదీ!'

**తెలుసా**

మన గుండెకాయనుండి శరీరములోని వివిధ భాగములకు రోజుకి 4,000 గాలన్ల రక్తము పంపబడుతూ వుంటుందట.

అని తలో మాటూ, ఆ సంచీ పట్టుకు ఘల్లు ఘల్లుమనిపించడం మొదలెట్టారు, ఆ గుడ్డివాళ్లతో పాటు, ప్లీడరు సలహామీాద, మార్వాడీకూడా చేయిచాచాడు. అందరూ గుడ్డివాళ్లవడంచేత, ఎవడో కొత్తవాడు అడుగుతున్నాడని తెలుసుకోక, ఆసంచీ మార్వాడీకి అందిచ్చాడు. ఆ సంచీ పట్టుకు మార్వాడీ ఉడాయించాడు.

"నేను పన్నిన సాచిక ఫలించిందా లేదా!" అన్నాడు ప్లీడరు నవ్వుతూ.

"అయ్యో! లేకపోతే, వాడు అన్యాయంగా పధ్నాలుగు మొహిరీలూ కాజేసేవాడే!...అయ్యో! మీారు, మరి సలహా ఇచ్చినందుకు...ఇదిగో...ఈ మొహరీ ఫీజుకింద తీసుకోండి...అని చెప్పి, మిగతా పధ్నాలుగు మొహిరీలూ పట్టుకు చక్కాబోయాడు మార్వాడీ. ఆఖరికా బిచ్చగాడు, దురాశమూలాన్ని, ఆ ఒక్క మొహిరీకూడా పోగొట్టుకున్నాడు... దురాశ దుఃఖానికి చేటు.


ఆయుర్వేద వైద్య నిలయంవారి

"లుకోరియా క్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్త వ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేదఔషధ రాజము.

90 మాత్రల ప్యాకెట్టు రూ. 2—8—0


ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము:

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట : : మచిలీపట్టణము.

అన్ని ముఖ్య పట్టణములలో స్టాకిస్టులు కావలెను



# కాకులు లేని కొండ కోటప్పకొండ

రచయిత్రి: మం. పద్మావతి (గుంటూరు)

పిల్లలూ! మీకు కోటప్ప కొండగురించి యేమైనా తెలుసా? తెలీదూ? అయితే నే జెప్పుతా వినండి:—

అసలు యీ కోటప్పకొండ గుంటూరు జిల్లాలో నరసరావుపేటకి యేడుమైళ్ళదూరంలో వుంది. ఈ కొండ పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించినదో చిన్నకథ వుంది. అదేమిటంటే పూర్వం ఈశ్వరుడు దక్షిణామూర్తి అవతారంతో యీ కొండమీద తపస్సు చేసుకుంటూండే వాడట. రోజూ అతనికి ఒక గొల్లభామ పాలు తెచ్చి ఇస్తూ వుండేది. ఇలా పాలు తీసుకు వెళ్తుంటే వొక రోజున కాకి వొకటి ఆ పాలలో మూతి పెట్టింది. గొల్లభామ ఎంగిలి బడ్డ పాలన్నీ పారబోసి, మళ్ళీ క్రొత్త పాలను తీసుకు వెళ్తూంది. ఈ సారికూడా కాకి పాలను ఎంగిలి చేసింది. ఆమె ఆ పాలన్నీ వొంపేసి, తిరిగి శుభ్రమైన పాలను ఈశ్వరుని కోసం తీసుకువెళ్తూంది. ఈసారికూడా కాకి పాలను ఎంగిలి చేసింది. గొల్లభామకు కాకిమీద భలేకోపం వచ్చింది. వచ్చి యేం చేసిందంటే కాకిని శపించింది. ''ఆ కొండ చుట్టుపట్ల యెక్కడా ఒక్క కాకేనా వుండకూడదు.'' అని శాపం యిచ్చింది. నిజంగా ఇప్పుడు కోటప్పకొండమీద వొక్క కాకికూడా కనుపించదట!

ఇలా వుంటూండగా ఆ గొల్లది కడుపుతో వుందిట. ఓనాడు ఈశ్వరుని చూచి ''ఓ యీశ్వరా! నేను యిదివరలో లాగ కొండ యెక్కలేక పోతున్నాను. కనుక క్రిందకు రావలసిం''దని కోరింది. దానికి ఈశ్వరుడు ''సరే నేను క్రిందకు

వస్తాను. నేను వస్తున్నప్పుడు నీవు వెనుకకు తిరిగి చూడరాదు అని అన్నాడు.

"అలాగే చేస్తా" నని వొప్పుకుందిఆమె. వెనుక ఈశ్వరుడు బయలుదేరి క్రిందకు వస్తున్నారు. ఈశ్వరుడు ఉఱుములు ఉఱిమేటట్లు, పెద్ద ధ్వనితో వస్తున్నాడు. పాపం! గొల్లభామ యింత వరకూ వెనుదిరిగి చూడకుండా వుంది. కాని, ఆ ధ్వనికి బెదిరి, వెనుదిరిగి చూచింది. ఇంకే ముంది! దేవుడు అక్కడే ఆగి పోయాడు. అక్కడే యిప్పుడు పెద్దగుడి కట్టేరు. ఈ దేముడి పేరే కోటీశ్వరస్వామి.

'గొల్లభామ గుడి' అని యీ గుడికి చేరువలోనే యింకొక గుడి వుంది. అదే గొల్లభామ చనిపోయింతరువాత పాతిపెట్టిన స్థలము

కోటప్ప కొండకుదగ్గర మీకు ఒక పెద్ద రాళ్లకుప్ప కనిపిస్తుంది. ప్రతియాత్రికుడు ఒక్కొక్క రాయి తీసి ఆ గుట్టలో వేస్తారు. అలా చేస్తేవాళ్లు చేసిన పాపం అంతా పోతుందట. శివరాత్రికి యిక్కడ గొప్ప ఉత్సవము చేస్తారు. ఈ ఉత్సవాలు చూడడానికి వేనకువేలు యాత్రికులు వస్తారు. ఇక్కడ యాత్రికుల కొరకై చాలా ధర్మసత్రములు వున్నవి. ఇది గొప్ప పుణ్యక్షేత్రములలో ఒకటి.

ఈ కొండకు సుమారు యేడు వందల యాభై మెట్లు వున్నాయి. కాని ఎక్కడం అంత కష్టంగా వుండదు. మీకు వీలైనపుడు కోటప్పకొండకు వెళ్ళి పైన నేను వ్రాసిన విషయాలన్నీ చూస్తారు కదూ ?


వికాసిని చిన్ని పాపలకు సంజీవి

అర్థముకాక ఎప్పుడూ ఏదో రూపంగా బాధించు సర్వ వ్యాధులకును సుస్థిరమగు నివారణ—మా వికాసిని. అల్లారుముద్దు పసిబిడ్డలపాలిటి ఆశాజ్యోతి.

ఏ విధమగు పథ్యము, యిబ్బందిలేని రుచికరమగు మందు. 3 వారములు పూర్తిగ వాడుచో సర్వలోపములు పోయి బిడ్డలు వికసింతురు.

ప్రస్తుతం { వారం మందు రూ. 6/- ; 3 వారములకు రూ. 15/- } వివరాలతో డబ్బు ముందు పంపవలెను.

ఖర్చులు భరించుచో వచ్చి చూడగలను. బీదలకు ఉచితము.

డాక్టరు. టి. రామచంద్రారావు, మిర్యాలపాలెం; ఒంగోలు.

# నల్ల బ్బాయి

రచన: తాతా వేంకట ఉమాదేవి, బొబ్బిలి.

అనగా వినగా ఒక ఊళ్లో ఒక అబ్బాయి వుండేవాడు. అతను నల్లగా మసిబొగ్గల్లే నలుపు. అంత నల్లగా వుండబట్టి గాబోలు, వాళ్లమ్మా నాన్న 'కృష్ణ' అని పేరు బెట్టారు. కృష్ణ రోజూ బడికి వెళ్ళేవాడు, బళ్లో అందరూ. వాణ్ణి 'బొగ్గుల్లో రామచిలుకా' అనేవారు. వాళ్ల మేష్టారుకూడా 'ఒరే మసిబొగ్గూ! ఇల్లారా' అనేవాడు. పాపం! కృష్ణుడికి యేడుపొచ్చి వాళ్ళమ్మా నాన్నతో చెప్తే, 'పోనీలే, నల్లగా వున్నావు గాబట్టి అన్నార' నేవారు.

ఇల్లా వుండగా, ఒకనాడు స్కూల్లో అందరూ ఒక సై, కృష్ణుణ్ణి ఒంటిగాచేసి ఏడిపించారు. అబ్బాయి బడివదలగానే యింటికివచ్చి, ఏడుస్తూ, అన్నం తినకుండా పడుకున్నాడు. అప్పుడు వాళ్ళ నాన్నవచ్చి, 'ఏంరా కృష్ణా! భోజనం చెయ్యలేదు?' అని అడిగారు. అడిగితే, 'నన్ను బళ్ళో అందరూ నల్లబ్బాయీ అని వెక్కిరిస్తున్నారు. నేను అన్నం తినను, బడికి వెళ్ళను.' అన్నాడు. అనేసరికి, నాన్ననవ్వి, 'ఓస్ యింతేనా! ఐతే, కృష్ణా! నేనో వుపాయం చెపాగాని, ముందు భోంచేసిరా.'

కృష్ణుడు సంతోషముతో లేచి, గబగబా భోం చేసి, 'నాన్నా! ఏమిటో చెప్పవూ?' అని అడిగాడు.

అప్పుడు వాళ్లనాన్న ఒక వుపాయం చెప్పేసరికి, మధ్యాహ్నం సంతోషంతో బడికి వెళ్లాడు. స్నేహితులంతా, 'ఒరే వచ్చాడురా మళ్ళీ బొగ్గుల్లో రామచిలుక' అని పకపకానవ్వి లేవిడీ చేశారు. అప్పుడు కృష్ణుడు కోపంగా 'ఒరేయ్! నన్ను తిడితే

దేవుణ్ణి తిట్టినట్లు--వెక్కిరించినా అంతే తెలుసునా?' అన్నాడు. 'అయితే ఎట్లాగో చెప్పరా చూద్దాం?' అన్నారు వాళ్ళు. కృష్ణ యిలాగన్నాడు. ఏమి టంటే—

ఒరేయ్! మన దేవుళ్లు— కృష్ణుడు నలుపు. రాముడు నలుపు. నదులూ, ఆకాశం నలుపు. ఇంకా చూడండి, పెద్ద పెద్ద సముద్రాలున్నాయా? అవి నలుపు. మనకు కనిపించే కొండ లన్నీ నలుపే! ఇంతెందుకూ? మనజుట్టు చూడండి! అది నలుపే కదా? నల్లగా లేకపోతే మనమే నవ్వుతాం, ఔనా? ఇంకా, నల్ల పిల్లి యెదురుగా వస్తే చాలా శుభం, తెలుసా? తెలుపు తెలు పని మహా ఎగుర్తున్నారు కాని, మీా తెలుపుని అరిపాదాల్లో అరగదీస్తున్నాం. మా నలుపుని కంటి పాపల్లో బహు భద్రంగా దాస్తున్నాం. అందుచేత నలుపని వెక్కిరిస్తే దేవుణ్ణి వెక్కిరించి నట్లన్నమాట. అదీగాక, మన మందరం అన్నదమ్ముల్లా కలసి మెలసి వుంటే, దేవుడు సంతోషించి మనందర్నీ దీవిస్తాడు. గనకా, ఓయ్ దద్దమ్మల్లారా! మన మందరం యింతటినుండీ తెలివి తక్కువగా పోట్లాడుకో వద్దు, తెలిసిందా?

అనేసరికీ, వాళ్లందరూకూడా, మరి ఆమాటే ఎత్తక, ఆ రోజు నుండీ అందరూ అన్నదమ్ముల్లా యెంతో సరదాగా వుండేవారు.

## గారు

తల్లి: అబ్బాయీ: నీతో ఎన్ని సార్లు చెప్పాలిరా అందరినీ "గారు" అనమని!


అబ్బాయి: అమ్మగారూ, పీట గారిని వేసి, అన్నంగారిని పెట్టే! ఆకలిగారు వేస్తోందీ. అదుగో! పిల్లిగారు ఇటొ స్తున్నారు! పాలుగారిని జాగ్రత్త!

సంపాదన: లీలాచిట్టి,
అహమదునగర్.

# బొమ్మల బాల

బాలా! నీకు బొమ్మలువేయడం వచ్చునా?

ఈ నెలలో "కోడి" బొమ్మ వేయడం నేర్చుకో.



ఈ పై బొమ్మలలోలాగ మొదట చుక్కల సున్నాలు; తరువాత మెడ తోక; తరువాత ఒళ్లు, రెక్కలు; ఆఖరి బొమ్మలో కాళ్లు వేస్తే చక్కని కోడి బొమ్మ తయారవుతుంది,

ఒచ్చే నెల "బాల"లో ఇంకో బొమ్మ.

# బాల బహుమానాలు

ఈ నెల లాటరీలో యీ దిగువ బాల చందాదారులకు బహుమానాలు వచ్చాయి. ఒక్కొక్కరికి 1 రూ॥ చొప్పున మనియార్డరు పంపబడును.

—మేనేజరు.

చందా నెం॥

సెక్రటరీ, విశ్వదాత నాగేశ్వరాయ లైబ్రరీ, (ఉరట్ల) 788

J. V. శ్రీనివాసులు నాయుడు, (బెంగుళూరు) 49

S. సుధాదేవి. (నెల్లూరు) 809

మాష్టర్. E. V. R. శర్మ, (వెస్టు జంషెడ్‌పూర్) 921

సెక్రటరీ, జాతీయ గ్రంథాలయం, (చెన్నూరు) 359

సెక్రటరీ, నేతాజీ పఠనాలయం, (మాధవరం) 1018

వడ్లమూడి సీతాలక్ష్మి, (నెల్లూరు) 835

శ్రీ రాజరాజేశ్వరీదేవి, (అంబాజీపేట) 1048

U. సుశీల, (చీరాల) 932

సెక్రటరీ, శ్రీ ఎఱ్ఱాప్రగడ గ్రంథాలయం, (గుడ్లూరు) 501

## పేర్లు పడలేదే!

డిసెంబరు బాలలోని ప్రశ్నలకు సరియైన జవాబులు పంపినవారి పేర్లు అన్నీ ప్రచురిస్తే ఒక 10 పేజీలు కావాలి. స్థలం ఎక్కడ చెప్పండీ? అంచేత ఆ పేర్లు ప్రచురించనందుకు క్షమించండి.

—సం॥


# జాతీయ పుస్తకములు

**1. ప్రజాపరిషత్తు :**

వివిధ రాజ్యాంగ పరిషత్తుల చరిత్ర విపులముగ చర్చించబడింది. ప్రతి భారతీయుడు తప్పక చదువవలసిన పుస్తకం. రచన : మామిడిపూడి వెంకటరంగయ్య 1- 8-0

**2. మానవుల హక్కులు :**

రచన : మామిడిపూడి వెంకటరంగయ్య 1- 0-0

**3. 1857 విప్లవం :**

(అశోక్ మెహతాకు అనువాదం) విప్లవకారుల చిత్రాలతో సహా 1- 8-0

**4. నిర్మాణ కార్యక్రమము :**

గాంధీజీ, రాజేంద్రబాబు, పట్టాభిగార్ల నిర్వచనములతో 0-12-0

ఇంకా ఎన్నో జాతీయ గ్రంథములు గలవు

దొరకు చోటు :

జాతీయ జ్ఞానమందిరము

త్యాగరాయనగరము - మదరాసు 17.



# బాల డైరి

[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో బాగుంటుంది. మేము ప్రతీ నెలా మదరాసులోని ఒక బాల డైరీ ప్రచురిస్తాం. చదవండి. —సం॥

## జనవరి

తేది

1. నా నేస్తం కొత్త సంవత్సరపు జేజేలు పంపించింది. నేనుకూడా పంపాను.

2. సాయంత్రం లీల మా ఇంటికొచ్చింది. నేనూ లీలా కలిసి బీచికి వెళ్లాం. అమ్మతో చెప్పకుండా వెళ్లానని అమ్మ నన్ను కోప్పడింది.

3. మామయ్య వచ్చాడు. నాకు మంచి చామంతి పువ్వులు తెచ్చాడు.

4. నేను ఇవాళ తలంటిపోసుకున్నాను. చెల్లాయిపోసుకోనని ఏడుస్తే అమ్మ కోప్పడింది.

5. నేను ఇవాళ రేడియో పిల్లల ప్రోగ్రాంకి వెళ్లాను. పాటపాడాను.

6. క్రిస్‌మస్ సెలవలాయక ఈ రోజున బడులు తెరిచారు.

7. పొద్దున్న ఆలశ్యంగా లేచాను. బడికి లేటుగా వెళ్ళాను. టీచరు క్లాసు బైటనిలుచోపెట్టారు. "ఛా! ఇంకెప్పుడు లేటుగా వెళ్ళకూడదు" అనుకున్నాను.

8. నాన్నగారు ఊరుకి వెళ్ళారు. అక్కనిబావని పండుక్కి తీసుకొస్తారట. ఆయ్‌హాయ్! మా బావ వస్తా...డు!

9. మా అమ్మ ఇవాళ మాకు కొత్త బట్టలు కుట్టించింది.

10. లెక్కలక్లాసులో ఇవాళ నాకు ఫస్టుమార్కు వచ్చింది.

11. చెల్లాయి భోగి పిడకల దండలు దాచుకుంటే, రామం ఒకదండతీసి నీళ్లపొయ్యిలో పడేశాడు. చెల్లాయి అమ్మతో చెప్పింది. రామం బీరువా వెనక దాగునివుంటే, నేను చూసి అమ్మతో చెప్పేశాను.

12. అక్కా బావా వచ్చారోయ్ వచ్చారు! బావ రాగానే 'పొట్టి బావ' పాట పాడాను. 'అమ్మ దొంగా!' అని బావ నన్ను పట్టుకోబోతే పారిపోయాను... బావనాకు రూపాయి ఇచ్చాడు. అమ్మదగ్గర దాచుకున్నాను.

13. ఇవాళ భోగి పండగ. పొద్దున్నే అందరం తలంటి పోసుకొని, కొత్త బట్టలు కట్టుకున్నాం. ముష్టివాళ్లకి బియ్యం పంచిపెట్టాం. సాయంత్రం భోగిపళ్లు పోసుకున్నాం.

14. ఇవాళ 'సంక్రాంతి బాల' వచ్చింది! నాక్కావాలంటే నాక్కావాలని, నేనూ తమ్ముడూ పోట్లాడు



కున్నాం. నేనిటూ వాడటూ లాగేసరికి 'బాల' చినిగిపోయింది. అమ్మ కొట్టింది.

15. ఇవాళకూడ బడికి సెలవే.

16. లీలకి జ్వరం వచ్చింది. చిరుతిళ్లు ఎక్కువగా తింటే అజీర్తిచేసి జ్వరంవచ్చిందని డాక్టరు చెప్పాడు.

17. ఇవాళ మామయ్య మమ్మల్ని ఎగ్జిబిషన్‌కి తీసుకువెళ్లాడు. అక్కడ ఒక చిత్రంచూశాం. టేబిలుమీద ఓపద్మంలో ఒక అమ్మాయి తల మాత్రంవుంది! కాళ్లూ చేతులూ ఏవీ కనబడలేదు. మేముమాట్లాడిస్తే ఆశల మాట్లాడింది! బలే గమ్మత్తుగా వుంది!

18. ఇవాళ లాంతరు తుడుస్తూ అమ్మ చిమ్నీ విరిచేసింది.

19. ఇవాళ అక్కా, బావా రేడియో స్టేషనుకి వచ్చారు. మా పిల్లల ప్రోగ్రాం విని ఎంతో మెచ్చుకున్నారు. "పొట్టిబావ" పాట రేడియోలోపాడి బావని వుడికిద్దాం అనుకున్నాను. టైము లేకపోయింది.

20. ఇవాళ రాయడానికి ఏ సంగతులూ లేవు.

21. మా తెలుగు మాస్టారు ఇవాళ క్లాసుకి రాలేదు. నేను 'బాల' చదువుకున్నాను.


22. లీల, ఇవాళ బ్లేడుతో పెన్సిలు చెక్కుతుంటే వేలు కోసుకొని రక్తం వచ్చింది. వెంటనే తడిగుడ్డ తెచ్చి వేలుకి కట్టాను. వేలు పైకి ఎత్తివుంచితే రక్తం రాలేదు.

23. 'బాల'లో బొమ్మలపద్యంచదివాను. నాకుకూడా అలాగ రాయాలని బుద్ధిపుట్టింది.

24. ఇవాళ అక్కా, బావా వూరికి వెళ్ళిపోయారు.

25. మా ఆంధ్ర బాలానంద సంఘం పిల్లలం ఇవాళ పెరంబూరు వెళ్లాం. అక్కడ చిన్న నాటకం, తమాషా వేషాలూ వేశాం. వచ్చేటప్పుడు సరదాగా రైలులో వచ్చాం.

26. ఇవాళ కాంగ్రెసు వాళ్లు పెద్ద



మీటింగుచేశారు. కాంగ్రెస్ జెండా ఎగరేసి, పాటలు పాడారు.

27. ఇవాళ మా రామం ఎక్కడనుంచో ఒకచిన్న కుక్కపిల్లని తెచ్చాడు. మేం దానికి పాలు పోశాం.

28. ఇవాళ మా నాన్న బిస్కతులు తెచ్చారు. కుక్కపిల్లకి బిస్కతు ముక్క పెడితే తిన్నాదికాదు.

29. అమ్మమ్మ వుత్తరం రాసింది. పది రోజుల్లో ఇక్కడికి వస్తుందట.

30. రామం, సీసాలోంచి వక్కపొడి తీస్తూంటే అమ్మచూసింది. ఆసీసా తీసుకుని 'హాత్ కాకీ'—అని ఆసీసా అలమారులో ఎత్తుగా దాచేసింది.

31. అమ్మనాకు ఫిడేలుకొని పాటనేర్పిస్తానంది. నేను ఇవాళ సావిత్రి గారింటికి వెళ్లి ఆడుకున్నాను.

# మా తాత - మా తమ్ముడు

మా తాతది బోసినోరు -
మా తమ్ముడిది కూడా బోసి నోరే !
మా తాతకి మాటలు సలిగ్గా పలకవు -
మా తమ్ముడికీ అంతే !
మా తాతకి ఛాక్‌లేట్ట్ అంటే ఇష్టం -
మా తమ్మునికీ అంతే !
మా తాత కూచుంటే లేవ లేడు !
లేస్తే కూచోలేడు -
మా తమ్ముడూ అంతే !
ఐ తే
ఒక్క తేడాఉంది....
మాతాతకి 'అవ్వ' వుంది
మా తమ్ముడికి లేదు !

రచన : "మధుమూర్తి"

# ఆరణాలిచ్చి 'బాల' ★ కొనుక్కో కూడదూ???

రచన : అవసరాల రామకృష్ణారావు, (తుని.)

"ఏమండీ! ఒకసారి బాల యిస్తారూ!" అని రంగు రంగుల బొమ్మలూ అవీ చూచి బాలని అడగడం!,

"అబ్బా! నేను చదవాలండీ!" అని నెమ్మదిగా వారు అంటే ఒక్క గడియ ఊరుకొని,

"ఒక్కసారి ఇద్దురూ! చదివారేమో! సరదాగా ఉంది" అని బ్రతిమాలుకోవడం!,

"అబ్బా! మాసిపోతుంది! క్షమించండి! నే నివ్వలేను." అని వారు కసురుకోడం.

ఎందుకొచ్చిన గొడవయ్యా యిదీ?
ఆరణాలిచ్చి బాల కొనుక్కో కూడదూ??

* * *

"మోహన్ వచ్చి పొయ్యిదగ్గర అల్లరి చేస్తున్నాడు ఓసారి తీద్దురూ?"

"ఆఫీస్ పని చూచుకో లేక చస్తున్నా. నీకేం?"

"అల్లాగే ఉంటుంది మరి! వెధవల్లరి పడలేకుండా ఉన్నాను. 'బాల' కొని యివ్వకూడదూ?"

"నీ సొమ్మేం పోయిందీ! ఆరణాలు ఖరీదు! నువ్వు గడిస్తున్నావా ఏం?"

"అదొక్కటే తక్కువ. రోజుకి రూపాయి సిగరెట్లు కాలుస్తున్నారు. ఓ ఆరణాలిచ్చి బాల కొనలేరూ మీ ఖర్చుల కన్నా నా! అల్లరి పెట్టకుండా చదువుకొంటాడు. నన్ను వంటచేసుకో నిస్తాడు. ఏం మోహన్?"

"అలాగేనే అమ్మా! వాళ్ళ చిట్టీవాళ్లూ చక్కగా చదువు కొంటారు. నాకేం తోచదు మరి!"

* * *

ఇంట్లో పిల్లలు అల్లరి చేస్తూంటారు!
పెద్దలు వాళ్ళకి వినోదం విజ్ఞానం చెప్పవచ్చు!!
ఆరణాలిచ్చి బాల కొనుక్కో కూడదూ?



# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!

చలికాలం వెళ్ళింది. ఎండా కాలం వస్తోంది. పరీక్షలు కూడా దగ్గరకు వస్తున్నాయి. మీరందరూ బాగా చదివి, పరీక్షలు ప్యాసవాలి, తెలుసా?

* * *

క్రిందటి నెలలో కొందరు చెల్లాయిలు, తమ్ముళ్లు వ్రాసిన ఉత్తరాల్లో విశేషాలేమిటంటే:

కాకినాడనుంచి డి. సిరికుమారి:

''అక్కా! నాకు నవంబరు 'బాల'లో 1 రూ॥ బాల బహుమానము వచ్చింది. మీకు వెంటనే కృతజ్ఞతా పూరితమైన వందనములు వ్రాయుటకు వీలైనది కాదు. ఆలశ్యమైనందులకు క్షమించ కోరెదను.''

చెల్లాయీ! ఇంత మాత్రానికే క్షమాపణా! నీవు బాల లాటరీ బహుమానమును ప్రేమతో అందుకొని, నీ సంతోషమును తెలియ చేసినందుకు చాలా సంతోషం. నీవు ఇంకా ఇంకా బాల బహుమానాలు ఎన్నో పొంది, వర్ధిల్లాలని మా ఆశీర్వచనాలు.

రామసుధాకర్ (తిరుపతి) నుంచి:

''ఇటీవల మన 'బాల' లో రాము, సోము, సరళ, విరళ అగుపడుట లేదు. వాళ్లు మంత్రులయిన తర్వాత మాకు సలహాల నివ్వటమే లేదు. నీవైనా కొంచము వారికి చెప్పి, ప్రతి 'బాల' లో వచ్చునట్లు చెయ్యి అక్కయ్యా!''

తమ్ముడూ! నిజమే. బాగా జ్ఞాపకం చేశావు. అలాగ మీకు ఏమేమి రచనలు కావాలో, బాలలో ఇంకా ఎటువంటి ఎటువంటి మార్పులు రావాలో,

మీరు తప్పకుండా సలహాలు ఇస్తూండాలి. మన మంత్రుల సంగతి ఎడిటరు గారితో చెప్పి, మార్చి నెల 'బాల' లో ప్రవేశ పెట్టుటకు ప్రయత్నిస్తాను.

అన్నట్టు ఇంకో సంగతి. క్రిందటి నెల సంక్రాంతి 'బాల' లో ఏనుగుపై ఓ కుర్రవాడు కూర్చుని యున్న బొమ్మ 3 వ పేజీలో చూచారా! ఆ యేనుగు పేరు 'మోటు'. ఆ మోటును గురించి ప్రతి నెలా మన 'బాల' లో ఒక చక్కని కథ వేస్తారు. మీరు ఆ కథను చదవండి. టాంకోస్క్రాప్ బుక్కులో ఆ కథను అంటించాలి. మీకా టాంకో స్క్రాప్ పుస్తకము కావాలంటే యీ క్రింద ఎడ్రసునకు వ్రాస్తే పంపుతారు.

ఎడ్రసు: ది. టాటా ఆయిల్ మిల్స్ కం|| లిమిటెడ్, పి. ఒ. బాక్స్ 63, బొంబాయి. (The Tata Oil Mills Co., Ltd P. O. Box 63, Bombay 1.)

* * *

మరల ఒచ్చే నెలలో కలుసుకుందాం ?

'అక్క'

# బాల సంఘాలు

**కొవ్వాలి బాలకాంగ్రెస్ సంఘము:**

ఈ సంఘం ఒక విజ్ఞప్తిపంపుతూ బాల సంఘాలన్నీ ఏకమవాలని కోరుతున్నారు. కమ్యూనిస్టు సంఘాల వైఖరిని నిరసిస్తున్నారు.

**మెథాడిస్టు బాల సంఘం, బెంగుళూరు:**

జనవరి 23 తేదీని యీ సంఘంవారు శ్రీ జ. గ. ప్రభాకరరావుగారి అధ్యక్షతను సభ జరిపి, శ్రీ త్యాగరాజుగారి జీవితంపై శ్రీ వెంకటచలపతి, రామచంద్రుడు, జయరాం, చార్లేసు, కుప్పస్వామి, రఘురామ శెట్టిగార్లు గీతములు, ఉపన్యాసములు ఇచ్చిరని, కార్యదర్శి నాగరాజుగారు వ్రాయుచున్నారు.

**సుభాస్ బాలసంఘం, (మొయిద) :**

ఈ సంఘం జనవరి 23 తేదీని స్థాపించబడింది. 20 బాలురు చేరారు; 300 పుస్తకములు వున్నవి. సుభాస్ బాబు గురించి ఉపన్యాసము శ్రీ రామకృష్ణ రాజుగారు చెప్పిరి. కార్యదర్శి పెనుమత్స సాంబశివరావు.

**తుమ్మలావ బాలసంఘం :**

"నైజాంలో పోలీసు దౌర్జన్యాలు నశించాలి, విశాలాంధ్ర నిర్మించాలి, నైజామ్ ఆంధ్రులకు సహాయంచేయాలి-"

అని ప్రతీరోజూ బాలురు ఊరేగింపులు జరిపి, జనవరి 9 తేదీ నాటికి రూ 4-11-9 వసూలు చేసి, బెజవాడ సహాయ కమిటీకి పంపారంటూ శ్రీ ఎ. మాణిక్యాలరావు గారు వ్రాస్తున్నారు.

సంస్థాన్ గోపాలపేట బాలసంఘం (నైజాం) :

ఈ సంఘం జనవరి పదోతేదీన సమావేశమై శ్రీ ఎస్. మన్నెము, శ్రీనివాసాచార్యులు; ఎస్. గోపాలమూర్తి, కేశవాచార్యులు, కె. కృష్ణమూర్తి గార్లను కార్యవర్గంలో ఎన్నుకున్నారు. 30 మంది సభ్యులు చేరారు. ప్రతి శుక్రవారము ఆట పోటీలు, విజ్ఞాన పోటీలు జరుపుటకు తీర్మానించారు. కొందరు పెద్దలు విరాళములు ఇచ్చారు.

అముజూరు బాలకాంగ్రెస్ :

జనవరి 3 తేదీని, ఉదయం ఊరేగింపుతో, సాయింత్రం సభతో యీ సంఘం ఏర్పడింది. శ్రీ సత్యనారాయణరావు చౌదరీగారు, పై. సూర్యనారాయణగారు ఉపన్యశించిరి. శ్రీ అప్పరాల కామేశ్వరరావు పాటలతో, 22 సభ్యులతో, తీర్మానములతో సభ ముగిసెను.

దురా బాలసంఘం, కిర్రో (సింధురాష్ట్రం) :

ఈ సంఘ వార్షికోత్సవం జనవరి నెల 20 వ తారీఖున శ్రీ శాంతి గిరి గారి అధ్యక్షత జరిగినది. శ్రీ శాంతి గిరి గారు తెలుగువారు అవుటచేత, సింధీ బాలురకు, బాలపత్రికల నుండి కొన్ని కథలు చదివి, సింధీభాషలో చెప్పినారు. సుమారు 150 మందికిపైగా సభకి వచ్చారు. చి॥ వి. ఎ. దుర్గాబాయమ్మ గారి కృషికి చాల మెచ్చుకొన్నారు. పిల్లలకు మిఠాయి పంచిపెట్టినారు. ఇద్దరు సింధీబాలురు సింధీ భాషలో పాటలు పాడారు. పిల్లలు "సర్వాణ కుమార్" నాటకము వేశారు. మ॥ వి. ఎ. పొన్నుస్వామిగారు నాటకము ఆడిన పిల్లలకు బహుమతులు పంచిపెట్టినారు.

## వింత మాటలు !

ఈ క్రింది మాటలు ఎటునుండి చదివినా ఒకటే !

నేతాజీతానే

కడువేడుక

తమాషామాత

పుకారుకాపు

సిరాతోరాసి

పాలునలుపా

మానవవనమా

రమాకుమార

మరబరమ

సంపాదన : బూ. వెం. రంగాచారి. (విశాఖపట్టణం)

# ఆంధ్ర బాలానంద సంఘము

బాల బాలికలారా!

"బాల" పత్రిక మొదలుపెట్టిన తరువాత బాలానంద సంఘముల అభివృద్ధికిగాను "బాల" పాటుపడుతూనే వుంది. మన తెలుగుదేశంలో అనేక బాల సంఘాలు ఏర్పడి, పనిచేస్తున్నాయని ఇన్నాళ్ళకు తెలుసుకొన్నాము. కాని ఇంతవరకూ మనకి ఒక కేంద్ర సంఘము - అంటే అన్ని సంఘాలకు సంబంధించిన పెద్ద సంఘము - లేదు. మా "ఆంధ్ర బాలానంద సంఘము" యొక్క ఉద్దేశము ఆ లోపము తీర్చుటే.

ఆంధ్ర బాలానంద సంఘమే మన కేంద్ర సంఘము. అన్ని బాల సంఘాలూ ఈ కేంద్ర సంఘములో సభ్యులుగా చేరాలని మా కోరిక. ఆంధ్ర బాలానంద సంఘము పెద్ద సభను మదరాసులో, యీ వేసవి సెలవులలో చేయుటకుకూడ ఏర్పాట్లు జరుగుచున్నవి.

మన తెలుగుదేశములో వున్న బాల సంఘాలన్నీ ఇది గమనించి, వెంటనే వారి వారి పూర్తి ఎడ్రసులు, ఇతరవివరాలూ, యీ దిగువ ఎడ్రసుకు రాయండి:

గౌరవ కార్యదర్శి:
ఆంధ్ర బాలానంద సంఘము,
c/o "బాల" ఆఫీసు
మైలాపూరు, మదరాసు 4.

# మంగళసూత్రం

ఈమధ్య నేనొక ఫిలుం చూచాను. బలే గమత్తుగా వుంది.

లలిత అనే అమ్మాయి మదరాసు వస్తుంది. ఆ రైలులోనే మనోహర్ అనే అబ్బాయికూడా మదరాసువస్తాడు. మదరాసులో ఇల్లు దొరకడం చాలా కష్టం. అందులోనూ ఒంటరి కుర్రాళ్ళకి మరీ దొరకదు. అంచేత ఇల్లుదొరకని మనోహర్‌రావూ, లలితా ఒక ఉపాయం ఆలోచించారు. వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలు కాకపోయినా. పైకి అలాగ చెప్పుకుని ఆ ఇల్లు అద్దెకు పుచ్చుకున్నారు.

ఆ ఇంట్లో వాళ్ళ అబద్ధపు సంసారం బలే గమత్తుగా వుంటుంది. ఇల్లు అద్దెకిచ్చిన అవ్వ, లలిత మెడలో పుస్తె లేదని, మనోహర్‌చేత పుస్తెకట్టిస్తుంది. ఇటువంటి తమాషాలతోవుంది యీ ఫిలుం. ఇంకా వేరే కథంతావుంది గాని నాకు ఇదే బాగుంది. యాక్టర్లు బాగా నటించేరు. మీ ఊరికి యీ ఫిలిం వచ్చిందా?

# చిత్రాంగి

చిత్రాంగి ప్రత్యేకసంచికచూచారా? "బాల" సైజుతో 160 పేజీలతో, రంగుల బొమ్మలతో, ఆడవాళ్ళను గురించి ప్రత్యేక రచనలతో బాగుంది. వెల 12 అణాలే. కావాలంటే ఇలా రాయండి: "చిత్రాంగి", 156, బ్రాడ్వే మదరాసు.

# గృహలక్ష్మి

కేసరికుటీరం వారి "లోధ్ర" అన్న పేరు మీరు వినేవుంటారు. "బాల"లో యీమధ్య ఒకసారి లోధ్ర ప్రకటన కూడా పడింది. ఆ లోధ్రను తయారు చేసే డాక్టరు కేసరిగారే ఇదివరలో "గృహలక్ష్మి" అనే పత్రిక నడిపారు. ఇది ఆడవాళ్ళ పత్రిక. చాలా బాగా వుండేది. యుద్ధం వచ్చింతరువాత ఆ పత్రిక ఆపేశారు. తిరిగి జనవరి నెల నుండి గృహలక్ష్మి వస్తోంది. ఇంకేం మంచిదేగా! బాలల తల్లులందరూ యీ పత్రిక చదవవలసిందే. కావాలంటే, "గృహలక్ష్మి ఆఫీసు," కేసరి కుటీరం, రాయపేట, మదరాసుకి రాయండి.

---

# పుస్తకాలు

**రుక్మిణీ కళ్యాణము:**

బమ్మెరపోతన రాసిన భాగవతం అందరూ చదవవలసిందే. కాని అందరూ అంతపెద్ద పుస్తకం కొనగలరా? ఆ భాగవతంలోని "రుక్మిణీ కళ్యాణం" భాగంమట్టుకు వేరే అచ్చువేసి, అందరికీ అందుబడిలో వుండేలాగ ప్రచురించారు. ఖరీదు పావలా.

**కుమారి శతకము:**

ఈ శతకంకూడా బాలికలకు చక్కని నీతులుచెలుపు పుస్తకం. వెల రెండణాలు.

ఈ పై రెండుపుస్తకాలూ కావాలంటే ఇలా రాయాలి: "రాయలు అండు కో" కడప.

# "నన్ను దింతుతే ★ ★ నేను తీత్తాను నాన్నా!"

బాలకు అప్పుడే చిన్న చిన్న మాటలు వస్తున్నాయి. ఒక నాడు బాలా, బాల అమ్మా, ఇద్దరూ గదిలో మంచం మీద పడుకున్నారు. మంచం ఎత్తుగా వుంది. గది తలుపులు మూసి పడుకున్నారు.

బాల నాన్న ఊరినుండి వచ్చారు. తలుపు వేసి వుండడం చూచి, తలుపు తట్టారు. ఎవరూ పలకలేదు. బాల అమ్మ హాయిగా నిద్రపోతోంది. నాన్నగారికి కోపం వచ్చి "అమ్మాయ్! అమ్మాయ్!" అని గట్టిగా పిలిచారు. బాల లేచింది. "తలుపుతియ్" అని నాన్న కేక వేశారు.

"అమ్మ పలుకుంది. నన్ను మంతం మీంతి దింతు నాన్నా! నేను తలుపు తీత్తాను." అని అంది మన ముద్దులబాల.

రచన : తాడేపల్లి రామలక్ష్మి, (బాపట్ల).

**తెలుసా**

యాభైనాలుగు సంవత్సరాల క్రితం అమెరికాలో 4 మోటారు కార్లున్నాయి. ఇప్పుడు 3,00,00,000 కు పైగా వున్నాయట.

# సంక్రాంతి బాలలోని ప్రశ్నలకు జవాబులు:

## 169

ఈ పైమూడు అంకెలనే ఉపయోగించి ఎంత పెద్ద అంకె చేయగలరు ? ఈ ప్రశ్నకు జవాబు 961 అని చాలామంది రాశారు. కాని అంత కన్నా పెద్ద అంకెను చేయగలం, అది 991. ఎలాగంటే,—6 అంకెను తిరగేస్తే 9 అవుతుందిగా !

---

## పొడుగూ—పొట్టీ

సంక్రాంతి బాలలోని "ఏది పొడుగు ఏది పొట్టి" అని కొన్ని గీతలు ఇచ్చాం.

క-కా, కి-కీ; ర-రా, రి-రీ; న-నా, ని-నీ ఈ జత గీతలన్నీ సరి సమానమే. మన కంటికి క-కా కంటే కి-కీ పొడుగ్గాను, ర-రా కంటే రి-రీ పొడుగ్గాను ని-నీ కంటే న-నా పొడుగ్గానూ కనబడుతుంది. అది వట్టి భ్రమ.

## దొంగను పట్టుకోండి


1. మొదటి వరుసలో అన్నీ పక్షుల పేర్లు ఇచ్చాము, కాని ఉష్ట్రపక్షి పక్షి కాదు. ఆ జట్టులో అది దొంగ.

2. రెండో వరుసలో మన జిల్లాల ముఖ్య పట్టణా లిచ్చాము. అందులో కృష్ణాజిల్లా ముఖ్య పట్టణం బందరు కాని బెజవాడ కాదు.

3. మూడో వరుసలో తీగలతో వున్న సంగీత వాద్యముల పేర్లు ఇచ్చాము. అందులో ఫ్లూటు దొంగ.

4. నాలుగో వరుసలో అడవి మృగముల పేర్లలో వేట కుక్క దొంగ.

5. అయిదో వరుసలో 'బావ' దొంగ.



# "బాల" పోటీ పరీక్ష

మొదటి బహుమానం రూ. **10**
రెండవ బహుమానం రూ. **6**
మూడవ బహుమానం రూ. **4**

పిల్లలారా! ఈనెలనుండి "బాల"లో మీకొక పోటీప్రశ్న వేస్తాము. ఈ పోటీలో 15 ఏండ్లకు **లోపువారే చేరాలి.**

ఈ నెల పోటీ :

## "బాలపత్రిక నాకు ఎందుకు ఇష్టం?"

**ఈ పై విషయాన్ని గురించి వ్యాసాలు రాసిపంపండి.**

వ్యాసం రెండు పావుతావులకు మించకూడదు. **అక్షరాలు కుదురుగా వుండాలి.** వ్యాసం మీ స్వంత రచనయై వుండాలి. ఎవరి రచనలు బాగుంటే అందులో చాలా బాగున్నవాటిలో మూడింటికి పైన వివరించిన మూడు బహుమానాలూ ఇస్తాము. గెలిచిన వ్యాసాలు "బాల"లో వేస్తాము.

ఈ పోటీలో ''బాల'' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.


ప్రవేశ రుసుము నాలుగణాలు.

ప్రవేశ రుసుము మనియార్డరుద్వారాగాని స్టాంపులుగాగాని పంపవచ్చును. మీరుపంపే కవరుమీద "బాల పోటీ'' అని పెద్ద అక్షరాలతో రాయాలి.

వ్యాసాలు 20 వ తేదీ లోపుగానే మాకుచేరాలి.

పై విలాసం ఇలా రాయండి :

"బాల పోటీపరీక్ష"
c/o "బాల" మైలాపూర్, మదరాసు 4.



# ఆలిండియా రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

**[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]**

[మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

---

## ఫిబ్రవరి

### 9-వ తేదీ ఆదివారం:

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచి; వేలుగాడు - నాటిక, పుట్టిన రోజులు; ఎగుడు దిగుడు - కథ; ఇది ఏమిటి? పాలపుంత; గొలుసుమాటలు; పోదామా.

### 16-వ తేదీ ఆదివారం:

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచీ; కవలపిల్లలు - నాటిక; పుట్టిన రోజులు; గుండుసూది - కథ; బండి పాట; చిక్కుప్రశ్న, పోదామా.

### 23-వ తేదీ ఆదివారం:

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచీ; తురాయి - నాటిక; పుట్టిన రోజులు; పొట్టిగుర్రం - కథ; ఇది ఏమిటి? తోకచుక్క; పోదామా.

## మార్చి

### 2-వ తేదీ ఆదివారం:

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; అల్లావుద్దీన్ - నాటిక; పుట్టినరోజులు; పిల్లిపిల్ల - హాస్యనాటిక; మీరు పంపిన కథలు; చిక్కుప్రశ్న; పోదామా.

---

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras.

# "బాల"ను గురించి కొన్ని మాటలు

- 'బాల' సం॥ చందా 6 రూ॥ మాత్రమే. అర్ధ సంవత్సర చందాలేదు. వీ. పీ. పద్ధతిలేదు.

- 'బాల' అన్ని వూళ్ళల్లో మా ఏజంట్లవద్దను, హిగ్గిన్ బాదమ్సు బుక్ స్టాల్సులోను దొరకును.

- 'బాల' చందాదారులు వారి వుత్తరాల్లోనూ, మనియార్డరు కూపనులోనూ వారి చందా నెంబరు తప్పకుండా రాయవలెను.

- 'బాల' పోస్టులో సరిగా అందకపోతే, మేము పూచీదారులము కాము. పోస్టులోపోకుండా అందాలంటే రిజిస్టర్డు పోస్టులో తెప్పించుకోవడం ఉత్తమం.

- 'బాల' కు పంపే రచనలు రెండు పేజీలకు మించకుండా చిన్నవిగాను, నీటుగాను ఉండవలెను.

- 'బాల' పాతకాపీలు లభించవు. కొన్ని ప్రతులుమాత్రమే ఉన్నవి. కావలసినవారు ఈక్రింది ఎడ్రసునకు రాయవలెను.

మేనేజరు : 'బా ల', మైలాపూరు, మదరాసు 4.


త్వరలో వస్తున్నది
నాగయ్య, లింగమూర్తి
రాజమ్మ, పార్వతీబాయి
నటించిన
వాహినీవారి
యోగి
వేమన
డైరెక్టరు - కే. వి. రెడ్డి గారు B.Sc. Hons.
camera sound art
BARTLEY. ARASU. NAGOOR & RAMARAO
STUDIO - NEWTONE